మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 11-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 282 Issue: 282

11 ఏప్రిల్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:06 సూర్యాస్తమయం - సా. 6:27 తిథి నవమి రా. 12:350 వరకు తరువాత దశమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ మ. 1:28 వరకు తరువాత శ్రవణ యోగం సిద్ధ సా. 6:27 వరకు కరణం తైతుల ఉ. 11:58 వరకు గరజ రా. 12:350 వరకు వర్జ్యం సా. 5:55 నుండి రా. 7:37 వరకు దుర్ముహూర్తం ఉ. 7:45 నుండి ఉ. 8:35 వరకు రాహుకాలం ఉ. 9:12 నుండి ఉ. 10:44 వరకు యమగండం మ. 1:49 నుండి మ. 3:22 వరకు గుళికాకాలం ఉ. 6:06 నుండి ఉ. 7:39 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:30 నుండి తె. 5:18 వరకు అమృత ఘడియలు ఉ. 6:38 నుండి ఉ. 8:23 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:42 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



# ఇరాన్ సంధి స్తలే

## హర్మూజ్ దాటేందుకు ఇబ్బందులు.. అక్కడే నిలిచిపోయిన 3,500 నౌకలు

- చిక్కుకున్న 20,000 మంది నావికులు
- రెండ్రోజుల్లో హర్మూజ్ దాటినవి 10 నౌకలే
- జలసంధి తెరిచేందుకు అమెరికా పాట్లు
- మిలటరీ ఆపరేషన్స్‌పై బ్రిటన్ పీఎంతో చర్చ
- చర్చలకు ముందు ఇరాన్ మరో బిగ్ ట్విస్ట్
- 2 డిమాండ్లు అంగీకరిస్తేనే చర్చలంటూ మెలిక

అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం వల్ల గొడవ తగ్గాల్సింది పోయి మరింత ఎక్కువ అయింది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ తగ్గేదేలేదంటోంది. గత రెండ్రోజుల్లో హర్మూజ్ జలసంధి దాటిన నౌకలు పదికి మించలేదు. అంతర్జాతీయ సముద్రయాన సంస్థ సమాచారం ప్రకారం.. హర్మూజ్ జలసంధి వద్ద ఏకంగా 3,500 నౌకలు నిలిచిపోయాయి. అందులో 20,000 నావికులు చిక్కుకున్నారు.

టెహ్రాన్: ప్రస్తుతం ఆ జలసంధి ఇరాన్ సైనికుల నియంత్రణలో ఉంది. ఎవరు సంధి దాటాలి? ఎవరు దాటకూడదు? అన్న నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జలసంధి నిర్వహణను కొత్త దశకు తీసుకెళ్తామంటూ ఇరాన్ కొత్త సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ ప్రకటించిన విషయం తరువాయి 2 వ పేజీలో...

# దేవుడే పంపిండన్నా!

## మీతో కలిసి పనిచేయుమన్నడు

## కేసీఆర్‌తో భేటీలో జీవన్ రెడ్డి భావోద్వేగం

## గులాబీ గూటికి చేరిన మాజీమంత్రి

## ఈ నెల 20న కార్యకర్తలతో పార్టీలో చేరిక!

## జగిత్యాలలో భారీ బహిరంగ సభ

సీనియర్ రాజకీయ నేత, మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు.



సిద్దిపేట/గజ్వేల్, జగిత్యాల, ఏప్రిల్ 10 (ఈవార్తలు): ' అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయాలని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జీవన్ రెడ్డి, కుమారులు, జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కేసీఆర్‌ను తరువాయి 2 వ పేజీలో...

> మీతో (కేసీఆర్) కలిసి పని చేయాలని దేవుడే నన్ను మీ దగ్గరకు పంపించాడు అన్నా. చాలా కాలం తర్వాత మళ్లీ మీతో పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది.
>
> - కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు

# మరింత డేంజర్‌గా ఇరాన్

## ఇజ్రాయిల్ తాజా నివేదికలో సంచలన విషయాలు

జెరూసలేం: వారం పది రోజుల్లో ఇరాన్ దారికి వస్తుందని భావించిన అమెరికా, ఇజ్రాయిల్‌ల కల కలగానే మిగిలింది. 40 రోజుల పాటు సాగిన యుద్ధంలో ఇరాన్ కన్నా అమెరికానే ఎక్కువ నష్టపోయింది. ఇదిలా ఉంటే, ఇప్పుడు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) నివేదిక ఒకటి సంచలనంగా మారింది. ఇరాన్ కొత్త ప్రభుత్వం, పాత ప్రభుత్వం కన్నా "ప్రమాదకరం"గా మారిందని ఇజ్రాయిల్ పార్లమెంట్ క్నెసెట్‌కు ఐడీఎఫ్ ఒక నివేదిక సమర్పించింది. యుద్ధం తొలిరోజే అప్పటి సుప్రీంలీడర్ ఆయతొల్లా తరువాయి 2 వ పేజీలో...






# నోట్ల కట్టల 'జడ్జి' రాజీనామా

అలహాబాద్: జస్టిస్ యశ్వంత్ వర్మ జడ్జి పోస్టుకు రాజీనామా చేశారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆయన రాష్ట్రపతిని కోరారు. నిరుడు ఢిల్లీ హైకోర్ట్ జడ్జిగా ఉన్నప్పుడు ఆయన ఇంట్లో కాలిపోయిన నోట్ల కట్టలు లభించడం రాజకీయ, న్యాయ వర్గాల్లో పెను దుమారం రేపింది. దీనిపై పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపింది. మొదట ఆ ఘటనతో తనకు సంబంధం లేదని.. ఆ సమయంలో తాను అక్కడ లేనని, తనను ఎందుకు అభిశంసించాలని జస్టిస్ వర్మ తరువాయి 2 వ పేజీలో...

# పొన్నాల ఎక్కడున్నడో..!?

## బీఆర్ఎస్‌లో దక్కిన గౌరవం కనిపిస్తూ ఉంది

## జీవన్ రెడ్డి విమర్శలపై సీఎం రేవంత్ ఎద్దేవా

మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌లో సీనియర్లకు అన్యాయం జరుగుతోందన్న విమర్శలను కొట్టిపారేస్తూనే, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీనియర్ నేతలకు ఎదురైన పరిస్థితులను ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ వేదికగా జరిగిన చిట్‌చాట్‌లో సీఎం ఈ అంశంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి తనపై చేసిన వ్యక్తిగత విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై నేను ప్రత్యేకంగా స్పందించను' అని పేర్కొన్నారు.



హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): కాంగ్రెస్‌లో సీనియర్లకు అవమానం జరుగుతోందని అంటున్న వారు, బీఆర్ఎస్ నుంచి సీనియర్ నేతలు ఎందుకు బయటకు వచ్చారో చెప్పాలన్నారు. 'ఒకప్పుడు బీఆర్ఎస్ కోసం పనిచేసిన ఆలె నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్ వంటి నేతలు బీఆర్ఎస్‌ను ఎందుకు వీడాల్సి వచ్చింది? అక్కడ వారికి జరిగిన అవమానం ఏంటో అందరికీ తెలుసు' అని సీఎం అన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఇప్పుడు ఎక్కడున్నారో, ఆయనకు బీఆర్ఎస్‌లో దక్కిన గౌరవం ఎంతో కనిపిస్తూనే ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో సీనియర్లకు జరిగిన అవమానాలు గుర్తులేవా? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎప్పుడూ తన నేతలను గౌరవిస్తుందని, కానీ కొందరు కావాలని చేస్తున్న విమర్శలకు కాలమే సమాధానం చెబుతుందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,235 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,148 |

# 6 నెలల్లో యూసీసీ

## మహిళలకు నెలకు రూ.3000.. ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్

## ఉచిత బస్సు ప్రయాణం కూడా.. బెంగాల్‌లో బీజేపీ హామీల వర్షం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోరు క్లైమాక్స్‌కు చేరుకుంది. బెంగాల్ పీఠమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ.. తాజాగా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా ఈ మేనిఫెస్టోను విడుదల చేస్తూ బెంగాల్ ప్రజలపై హామీల వర్షం కురిపించారు. చొరబాటుదారుల ఏరివేత నుంచి మహిళలకు ఆర్థిక భరోసా వరకు అమిత్ షా ప్రకటించిన అంశాలు ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో సెన్సేషన్ రేపుతున్నాయి. ఇంటి పెద్దగా ఉన్న ప్రతి మహిళా ఖాతాలో ప్రతి నెలా రూ.3000 జమ చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తరువాయి 2 వ పేజీలో...



## విశ్వవాణి



సోలార్ ప్యానెల్స్ సూర్యరశ్మి నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేయడం తెలుసు. కానీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్స్ సైన్స్ ఆఫ్ సెవిల్లే శాస్త్రవేత్తలు.. వర్షపు బిందువుల నుంచి కూడా విద్యుత్తును ఉత్పత్తి చేసే సోలార్ ప్యానెళ్లను అభివృద్ధి చేశారు.



# భారతీయులు.. బంగారం!

## కుటుంబాల వద్ద 464 లక్షల కోట్ల పసిడి.. 10 పెద్ద బ్యాంకుల వద్ద ఉన్న గోల్డ్ కంటే ఎక్కువ వాల్యూ

భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం నిల్వలు ప్రపంచంలోని అగ్రశ్రేణి 10 సెంట్రల్ బ్యాంకుల వద్ద ఉన్న మొత్తం బంగారం కంటే ఎక్కువగా ఉన్నాయని ప్రముఖ వాణిజ్య మండలి అసోచామ్ తన నివేదికలో సంచలన విషయం వెల్లడించింది. 2024-25, 2026 ఆరంభంలో బంగారం ధరలు భారీగా పెరగడంతో, భారతీయుల ఇళ్లలో ఉన్న పసిడి విలువ ఏకంగా 5 ట్రిలియన్ డాలర్ల (రూ.464 లక్షల కోట్లు) స్థాయికి చేరిందని అంచనా వేసింది.

న్యూఢిల్లీ: ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ సంపదలో ఒకటిగా నిలిచింది. అయితే, ఇంత భారీ మొత్తంలో ఉన్న బంగారం సరైన వినియోగంలోకి రావడం లేదని, వినియోగంలోకి వస్తే ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారగలదని అసోచామ్ -2 వ పేజీలో...

# పడవ బోల్తా.. 10 మంది మృతి

## యూపీలో దారుణ విషాదం



మధుర: ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి -2 వ పేజీలో...



# నక్సల్ ఫ్రీ తెలంగాణ

## ప్రకటించిన డీజీపీ.. 42 మంది మావోయిస్టులు లొంగుబాటు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టులకు చెందిన కీలక నాయకులతో సహా మొత్తం 42 మంది మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో 36 ఆయుధాలు, 800 గ్రాముల బంగారంతో లొంగిపోయారని పోలీసులు ప్రకటించారు. వీరంతా చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వారని వెల్లడించారు. పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్, డీకేఎస్‌జెడ్‌సీ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు
11.4.2026

మేషం: అనారోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. విద్యార్థుల ఫలితాలు నిరుత్సాహ పరుస్తాయి. చిన్ననాటి మిత్రులతో కలహా సూచనలున్నవి. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణ సూచనలున్నవి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ వాతావరణం ఉంటుంది.

వృషభం: ఋణదాతల నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. చేపట్టిన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగులకు అధికారులతో నూతన సమస్యలు కలుగుతాయి. ఆర్థికంగా నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

మిధునం: ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. ఆర్థిక వృద్ధి కలుగుతుంది. సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబ విషయమై ముఖ్య నిర్ణయాలు అమలుపరుస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. నూతన ధన వస్తులాభాలు పొందుతారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

సింహం: సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. అవసరానికి ధన సహాయం అందుతుంది. ముఖ్యమైన పనులు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ పెరుగుతుంది. ఆరోగ్య సమస్యల వలన చికాకులు పెరుగుతాయి. వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు.

కన్య: ఇంటా బయట అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. పుణ్యక్షేత్రాలు దర్శిస్తారు. ఆరోగ్య విషయాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వృత్తి, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

తుల: పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వాహనయోగం ఉన్నది. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు తీసుకుని లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది.

వృశ్చికం: ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఉదర సంభందిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆర్థిక సమస్యలు బాధిస్తాయి.

ధనస్సు: ఇంటా బయట ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో పెద్దల ఆదరణ పెరుగుతుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు అందుకుంటారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

మకరం: వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఇంటా బయట ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

కుంభం: ఆర్థిక పురోగతి సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి స్నేహితులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో అనుకూలత పెరుగుతుంది.

మీనం: ఉద్యోగమున మీ పని తీరుకు గుర్తింపు పొందుతారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు అనుకున్న విధంగా రాణిస్తాయి. చిన్ననాటి మిత్రులతో గృహమున ఉత్సాహంగా గడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. వ్యాపారాలు నూతనోత్సాహంతో లాభాలు అందుకుంటారు.

# ఇరాన్ సంధి స్తలే

**మొదటి పేజీ తరువాయి**

తెలిసిందే. తమ విధానం మరింత వ్యూహాత్మకంగా, కఠినంగా ఉంటుందని కూడా తెలిపారు. 'ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కానీ మా హక్కులను వదులుకోవడానికి సిద్ధంగా లేము. దాడుల్లో నా తండ్రి అయతొల్లా అలీ ఖమేనీ, ఇతర కీలక నేతల మరణానికి ప్రతీకారం తీర్చుకోవాలనే మా సంకల్పం బలంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా యుద్ధంలో జరిగిన నష్టాలకు గానూ పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చమురు రవాణా ఆగనివ్వను: ట్రంప్

ఇరాన్ తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇరాన్ సహకరించినా, సహకరించకపోయినా చమురు సరఫరాను త్వరలోనే సాధారణ స్థితికి తెస్తాం' అని స్పష్టం చేశారు. 'ఇరాన్ చాలా దారుణంగా ప్రవర్తిస్తోంది. జలసంధి గుండా చమురు వెళ్లకుండా అడ్డుకోవడం మేము చేసుకున్న ఒప్పందంలో లేదు. టోల్ వసూళ్లను వెంటనే నిలిపి వేయాలి. లేదంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది' అని హెచ్చరించారు. ప్రపంచ చమురు అవసరాల్లో 20 శాతం సరఫరా అయ్యే ఈ మార్గంలో ఇరాన్ వైఖరి గౌరవప్రదం కాదని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్ మధ్య ప్రత్యక్ష చర్చలు జరగనున్నాయి. ఈ చర్చలకు కొన్ని గంటల ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి బెదిరింపులకు దిగారు. ఒప్పందం కుదరకపోతే మరిన్ని దాడులు చేస్తామని హెచ్చరించారు. న్యూయార్క్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. చర్చలు విఫలమైతే అమెరికా ఆయుధాలను చాలా సమర్థవంతంగా ఉపయోగిస్తుందని హెచ్చరించారు. 'మేము పునఃప్రారంభిస్తున్నాం. నౌకలలో అత్యుత్తమమైన మందుగుండు సామగ్రిని, ఇప్పటివరకు తయారు చేసిన అత్యుత్తమ ఆయుధాలను నింపుతున్నాం. గతంలో మేము ఉపయోగించిన వాటి కంటే కూడా మెరుగైనవి. వాటితోనే మేము వాటిని పేల్చివేశాం. ఒకవేళ మన మధ్య ఒప్పందం కుదరకపోతే, మేము వాటిని ఉపయోగిస్తాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్‌లు పాల్గొంటున్నారు. కానీ, ఇరాన్ తరఫున ఎవరు చర్చల్లో పాల్గొంటారనేది ఇంకా స్పష్టత లేకపోవడం గమనార్హం. అయితే, ఇరాన్ నుంచి మధ్యవర్తుల రాకపై ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని సరిగ్గా అమలు చేయడంలో విఫలమయ్యారని ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నాయి.

## హార్ముజ్ దాటింది 10 నౌకలే

కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత హార్ముజ్ జలసంధి నుండి నౌకల రాకపోకలు పెరగాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. డేటా ప్రకారం ఇప్పటి వరకు కేవలం 10 నౌకలు మాత్రమే ఈ మార్గాన్ని దాటగలిగాయి. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య దాడులు, ఇరాన్ నాయకత్వం కఠిన వైఖరి ఈ అనిశ్చితికి ప్రధాన కారణాలుగా కాగా, కాల్పుల విరమణ ఒప్పందం నీరుగారుతోంది. ముఖ్యంగా ట్రంప్ మొదట్లో శాంతిపై ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ.. ఇరాన్ టోల్ వసూళ్లకు తెరలేపడంతో ఆయన స్వరం ఒక్కసారిగా మారిపోయింది. ఒకవైపు హెచ్చరికలు జారీ చేస్తూనే.. మరోవైపు దౌత్యపరమైన మార్గాలను అమెరికా అన్వేషిస్తోంది.

## ఇరాన్ మరో ట్విస్ట్

చర్చలకు కొన్ని గంటల ముందు ఇరాన్ బిగ్ ట్విస్ట్ ఇచ్చింది. ముందుగా కొన్ని తమ షరతులు నెరవేర్చితేనే చర్చల్లో పాల్గొంటామని ప్రకటించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ గాలిబాఫ్ మాట్లాడుతూ.. కాల్పుల విరణమను లెబనాన్‌కు కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. విదేశీ బ్యాంకుల్లో ఉన్న ఇరాన్ ఆస్తుల్ని వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. అయితే, ఈ రెండు షరతులు నెరవేరితేనే చర్చలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ కాల్పుల విరణమ ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి అన్నారు. లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ఆగాలని డిమాండ్ చేశారు. లెబనాన్ కూడా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగమని చెప్పారు. ఇజ్రాయిల్ దాడులు ఆగకుంటే మొత్తం శాంతి ప్రక్రియ దెబ్బతింటుందని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, ఇప్పటికే అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇస్లామాబాద్‌కు బయలుదేరారు. మరోవైపు, ఇరాన్ నుంచి ప్రతినిధి బృందం ఇంకా పాకిస్తాన్ వెళ్లకపోవడం గమనార్హం.

### మరింత డేంజర్‌గా
# ఇరాన్

**మొదటి పేజీ తరువాయి**

అలీ ఖమేనీని హత్య చేసిన తర్వాత పరిస్థితులు తమకు అనుకూలంగా మారుతాయని భావిస్తే కథ అడ్డం తిరిగింది. ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ ప్రకారం, ఐడీఎఫ్ ప్రతినిధులు క్నెసెట్ విదేశీ వ్యవహారాలు, రక్షణ కమిటీకి ఒక రహస్య నిఘా సమావేశంలో కొత్త పాలన గురించి వివరించారు. ప్రస్తుత పాలన నాయకులకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌తో సంబంధం కలిగి ఉందని, వీరు గత రాజకీయ నాయకత్వం కంటే మరింత తీవ్రవాద భావజాలాన్ని కలిగి ఉన్నారని కమిటీకి ఇజ్రాయిల్ మిలిటరీ తెలియజేసింది. ఒకవేళ ఈ అంచనా నిజమైతే ఇది ఇజ్రాయిల్, యూఎస్‌కు అతిపెద్ద సవాలుగా మారుతుందని చెప్పారు. 40 రోజుల యుద్ధంతో ఇరాన్ పోరాడి నిలిచింది. సైనిక శక్తులైన ఇజ్రాయిల్, యూఎస్‌ను ఎదురించి దాడులు చేసింది. హార్ముజ్ జలసంధిని మూసేసి ప్రపంచ చమురు భద్రతను సవాల్ చేసింది. ఈ మొత్తం దాడిలో ఇజ్రాయిల్ ఎయిర్ ఫోర్స్ ఇరాన్ లో 1000కి పైగా వైమానిక దాడులు చేసింది. మొత్తంగా 8500పైగా ఆపరేషన్ మిషన్లు పూర్తి చేసి, దాదాపుగా 400 లక్ష్యాలను కొట్టింది.

## పడవ బోల్తా.. 10 మంది మృతి

**మొదటి పేజీ తరువాయి**

వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నోట్ల కట్టల 'జడ్జి' రాజీనామా

**మొదటి పేజీ తరువాయి**

ప్రశ్నించారు. అయితే ఘటన జరిగిన గదిపై జస్టిస్ వర్మ కుటుంబానికి నియంత్రణ ఉందని పార్లమెంటరీ విచారణ కమిటీ తెలిపింది. మరోవైపు ఆయనను అభిశంసించాలని 146 మంది ఎంపీలు చేసిన తీర్మాన ప్రతిపాదన త్వరలోనే పార్లమెంట్ ముందుకు వచ్చే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో జస్టిస్ వర్మ రాజీనామా చేయడం గమనార్హం.



## భారతీయులు.. బంగారం!

**మొదటి పేజీ తరువాయి**

అభిప్రాయపడింది. ప్రతి ఏటా ఇళ్లలోని బంగారంలో కనీసం 2 శాతాన్ని ఆర్థిక సాధనాల్లోకి మళ్లించగలిగితే, దేశ ఆర్థిక వృద్ధికి గణనీయమైన ఊతం లభిస్తుందని విశ్లేషించింది. ఇదే ధోరణి కొనసాగితే, 2047 నాటికి దేశ జీడీపీకి అదనంగా 7.5 ట్రిలియన్ డాలర్లు జతవుతాయని, తద్వారా మన ఆర్థిక వ్యవస్థ 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటగలదని అంచనా వేసింది. ప్రస్తుతం ఇళ్లలో ఉన్న బంగారం చాలా వరకు అధికారిక ఆర్థిక వ్యవస్థకు దూరంగా ఉంది. దీనిని గోల్డ్ మానిటైజేషన్ పథకాలు, గోల్డ్ లోన్లు, బంగారం ఆధారిత ఆర్థిక సాధనాల ద్వారా వినియోగంలోకి తేవాలని అసోచామ్ సూచించింది. ఇప్పటికే బంగారంపై రుణాలు తీసుకునే ధోరణి పెరుగుతోందని, నవంబర్ 2025 నాటికి బంగారం, ఆభరణాలపై రుణాలు రూ.24.34 లక్షల కోట్లకు చేరాయని నివేదిక తెలిపింది. ప్రపంచ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం, భారత్ వద్ద అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం నిల్వలు ఉండగా, ప్రపంచంలో 8వ స్థానంలో ఉంది. కానీ, ఇళ్లలో ఉన్న ప్రైవేట్ బంగారం నిల్వలు దీనికంటే ఎన్నో రెట్లు అధికమని, ఏ దేశంలోనూ ఇంతటి ప్రైవేట్ బంగారం లేదని అసోచామ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, దేశ దీర్ఘకాలిక వృద్ధి కోసం ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న బంగారం ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

# పొన్నాల ఎక్కడున్నడో..!?

**మొదటి పేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డీలిమిటేషన్ అనేది కేవలం రాజకీయ పార్టీల సమస్య కాదని, ఇది ప్రాంతాల అస్తిత్వానికి సంబంధించిన సమస్య అని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్రం ఆడుతున్న రాజకీయ డ్రామా అని సీఎం విమర్శించారు. "మహిళా రిజర్వేషన్లు ఇవ్వడానికి పునర్విభజన అవసరమే లేదు. కానీ, దీని సాకుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాముఖ్యతను తగ్గించాలని కేంద్రం కుట్ర చేస్తోంది. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది రాష్ట్రాల ఎంపీ సీట్లు 600 దాటితే, దక్షిణాది సీట్లు కేవలం 195 దగ్గరే ఆగిపోతాయి. అప్పుడు కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సౌత్ ఇండియా అవసరమే ఉండదు. ఇదే కేంద్రం అసలు ప్లాన్" అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే పన్నుల వాటాలో, నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయానికి గురవుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. "సౌత్ ఇండియా ఫైనాన్షియల్ క్యాపిటల్‌గా ఉంటే, నార్త్ ఇండియా పొలిటికల్ క్యాపిటల్‌గా మారింది. ఎన్నో ఏళ్లుగా మమ్మల్ని సెకండ్ గ్రేడ్ సిటిజన్స్‌గా చూస్తున్నారు. ఇప్పటికే గాయపడి ఉన్న దక్షిణాది రాష్ట్రాలపై ఇంకా అన్యాయం చేస్తామంటే ప్రజలు తిరగబడటం ఖాయం. ఇది చివరకు పెద్ద ప్రజా ఉద్యమానికి దారితీస్తుంది" అని హెచ్చరించారు. ముందుగా దేశవ్యాప్తంగా జనగణన, కులగణన పూర్తి చేయాలి. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియ ముగిశాకే డీలిమిటేషన్‌పై ఆలోచించాలి. కేవలం జనాభానే కాకుండా ఆర్థికాభివృద్ధి, జీడీపీ, కుటుంబ నియంత్రణ పాటిస్తున్న తీరును బట్టి ఎంపీ సీట్ల పెంపు ఉండాలి. ఈ వివక్షపై 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పక్షాలతో చర్చించి ఉమ్మడి పోరాటం చేస్తాం. గతంలో రైతుల చట్టాల విషయంలో ఎలాగైతే వెనక్కి తగ్గారో, మొండిగా వెళ్తే డీలిమిటేషన్ విషయంలోనూ బీజేపీకి అదే గతి పడుతుంది. తెలంగాణలో ఐదు నెలల్లోనే జనగణన, కులగణన పూర్తి చేసి మేం చిత్తశుద్ధిని చాటుకున్నాం, కేంద్రం కూడా అదే బాటలో నడవాలి' అని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# 6 నెలల్లో యూసీసీ

**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించడంతో పాటు మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దుర్గా సురక్ష స్క్వాడ్‌ను ఏర్పాటు చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని బీజేపీ స్పష్టం చేసింది. బంగ్లాదేశ్ సరిహద్దుల నుంచి వచ్చే చొరబాటుదారులపై డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ విధానాన్ని అమలు చేయడంతో పాటు గోవధను అరికట్టడతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే 7వ పే కమిషన్‌ను అమలు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ చెల్లిస్తామని చెప్పారు. "నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 ఆర్థిక సహాయం చేస్తాం. ఉత్తర బెంగాల్‌లో కొత్తగా ఎయిమ్స్, ఐఐటీ, ఐఐఎంలను ఏర్పాటు చేస్తాం. బెంగాల్ వారసత్వాన్ని చాటేలా వందేమాతరం మ్యూజియం నిర్మిస్తాం" అని షా ప్రకటించారు. "గత 50 ఏళ్లుగా వామపక్షాలు, టీఎంసీ బెంగాల్‌ను నాశనం చేశాయి. భయం లేని బెంగాల్‌ను సృష్టించడమే బీజేపీ లక్ష్యం. బెంగాల్ ముఖ్యమంత్రి బెంగాలీనే అవుతా రు. మా ఆదేశాలు ఢిల్లీ నుంచి వస్తాయి కానీ, బంగ్లాదేశ్ నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం పని చేసే ప్రభుత్వం మాది కా దు" అంటూ అమిత్ షా ఘాటు వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఏరివేయడ మే తమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. కాగా పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువ దనున్నాయి. ఈసారి పూర్తి మెజారిటీతో బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురుతుం దని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## నక్సల్ ఫ్రీ తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి**

సభ్యుడు సోడి మల్ల ఎలియాస్ కేషాల్, జేఎంఎండబ్ల్యూసీ డివిజనల్ కమిటీ కార్యదర్శి చాప నారాయణ అలియాస్ గజేందర్, బీకే ఎస్ఆర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కడ్తి సన్నుతో లొంగిపోయారు. ఐదు ఏకే-47 రైఫిళ్లు, నాలుగు ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, మూడు ఇన్‌సాస్ రైఫిళ్లు, ఆరు 303 రైఫిళ్లు, ఒక 9ఎంఎం స్టెన్ గన్, రెండు 8 ఎంఎం రైఫిళ్లు, పది సింగిల్ షాట్ గన్స్, ఒక 9 ఎంఎం పిస్టల్, రెండు రివాల్వర్లు, 1007 తూటాలు, 800 గ్రాముల బంగారాన్ని పోలీసులకు అప్పగించారు. 42 మంది జనజీవన స్రవంతిలో కలవడం ద్వారా సీపీఐ మావోయి స్టులోని మూడు మ్యాజిక్ వెపన్స్‌లో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పూర్తిగా కనుమరుగు అయిందని తెలిపారు.లొంగిన మావోయిస్టులకు కోటీ 93 లక్షల రివార్డును అందజేస్తామని వివరించారు.

# దేవుడే పంపిండన్నా!

**మొదటి పేజీ తరువాయి**

కలిశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డాక్టర్ కే సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కే విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఫాంహౌస్ లోపలికి వెళ్లగానే, జీవన్ రెడ్డికి కేసీఆర్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సంద్భంగా జీవన్‌రెడ్డిని కేసీఆర్ సన్మానించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహా తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు. అనంతరం కలిసి భోజనం చేశారు.

## కాంగ్రెస్ పతనం మొదలైంది: జీవన్ రెడ్డి

కేసీఆర్‌తో సమావేశానంతరం మీడియాతో మాట్లాడిన జీవన్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై పట్టు కోల్పోయిందన్నారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్టు సీఎం నడుచుకునే వారని, కానీ ఇప్పుడు సీఎం చెబితే పీసీసీ అమలు చేస్తోందని సెటైర్ లు వేశారు. రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి అనే నినాదం ప్రజల్లో మొదలైందని జీవన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలుచేశారు. రెండేళ్లలో 3 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, ఇచ్చింది 17 వేల ఉద్యోగాలు మాత్రమే అంటూ కాంగ్రెస్ ను తూర్పారబట్టారు. మొదటి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు అని అన్నారు.. రెండో సంవత్సరం 1 లక్ష ఉద్యోగాలు అని అన్నారు, ఏమైందని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంను జీవన్ రెడ్డి నిలదీశారు. అంతేకాకుండా.. పీసీసీ తప్పు చేసి ఆ నిందను ఏఐసీసీపై వేస్తుందని అన్నారు. తనకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే అది నా సమర్థతోనే ఇచ్చారని అన్నారు. కంటెంట్ ఉన్న నాయకున్నీ కాబట్టే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికార పార్టీ నుంచి ప్రతిపక్షంలోకి ఎందుకు వెళ్తున్నానో ప్రజలకు తెలుసన్నారు. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమనంలో పయనిస్తుందని ఎద్దేవా చేశారు. కనీసం మిగిలిన రెండున్నరేళ్ల అయిన కాంగ్రెస్ ప్రభుత్వం బాగా పని చేయాలని కోరుకుంటున్నట్లు చివాట్లు పెట్టారు. ఒక వేళ పదవుల కోసమే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాలంటే నేను ఆరోజే వెళ్ళేవాడినంటూ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చనందుకు, ప్రజల పక్షాన పోరాడేందుకు నేను బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లేందుకు నిర్ణయించుకున్నట్లు మాజీ మంత్రి జీవన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

## 20న బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి: కొప్పుల ఈశ్వర్

బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు జీవన్ రెడ్డికి ముహూర్తం ఖరారైందని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ నిర్వహిస్తుందని చెప్పారు. ఈ సభలో బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి చేరతారని అన్నారు. భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు శనివారం జగిత్యాలలో స్థలాన్ని పరిశీలిస్తామన్నారు. రాష్ట్రంలో రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై ఈ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్లీనరీ సభకి ముందే పార్టీలో చేరికలు ఉంటాయన్నారు. కేసీఆర్‌తో కలిసి పని చేయడానికి జీవన్ రెడ్డి ముందుకు వచ్చారని చెప్పారు. పార్టీలో తగిన ప్రాధాన్యం ఇస్తామని జీవన్ రెడ్డికి కేసీఆర్ హామీ ఇచ్చారని ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ గుర్తు చేశారు. ఇక, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ప్రజాక్షేత్రంలోకి రానున్నారని ఆ పార్టీ నేత ఎల్ రమణ వెల్లడించారు. ప్రజా సమస్యలపై ఇకపై నిరంతరంగా పోరాటం చేస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతామని పేర్కొన్నారు.

# రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు

## బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ ఫైర్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టాలనే ప్రయత్నం చేస్తే బీజేపీ ఊరుకోబోదని, ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం చేస్తుందని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిందేనని, కేంద్రం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రంపై అనవసర ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలు అంటే ప్రజల సమస్యలు చర్చించి పరిష్కారం దిశగా అడుగులు వేయాల్సిన వేదిక అని, ఆ ఆశలు నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ బడ్జెట్ సమావేశాలు కనీసం 45 రోజులు జరగాలని డిమాండ్ చేసేదని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటలను పూర్తిగా మర్చిపోయి కేవలం 10 రోజుల్లోనే సమావేశాలు ముగించడం బాధాకరం అని ఆవేదన చెందారు. ఈ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని తాము అనేక సమస్యలను శాసనసభలో ప్రస్తావించడానికి ప్రయత్నించినప్పటికీ, మా గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద విమర్శలు వస్తే సరైన సమాధానం ఇవ్వకుండా మంత్రులు ఎగతాళి చేయడం, ఎదురుదాడి చేయడం దురదృష్టకరమన్నారు. జాతీయ గీతం, వందేమాతరంను అవమానించిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం వారిని ప్యానల్ స్పీకర్‌గా నియమించడం దేశానికి అవమానకరమని ఆరోపించారు. కాగ్ నివేదికలో రాష్ట్ర ప్రభుత్వ లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని స్పష్టంగా వెల్లడైందన్నారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన రూ.60 వేల కోట్లను కూడా ఖర్చు చేయలేకపోయారని కాగ్ చూపించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయడంలో



కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో 53 వేల ఎకరాల ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్ ఉంటే 2014 నుండి దీనిపై సర్వేలు నిర్వహించలేదని చెప్పినా కాగ్ హెచ్చరికలను పట్టించుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూపిందని మండిపడ్డారు. తెలంగాణను జాతీయ కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలా ఉపయోగించుకుంటుందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పూర్తిగా పక్కన పెట్టి, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారానికి నిధులు తరలించడం జరుగుతోంది. కేరళంలో జరుగుతున్న ఎన్నికల్లో తెలంగాణ కాంగ్రెస్ నాయకులే పెద్ద ఎత్తున ఇంచార్జ్‌లుగా వ్యవహరించడం, ఈ నిధుల వినియోగంపై అనుమానాలను మరింత పెంచుతోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన లక్షల కోట్ల అవినీతి బయటపెడతామని, విదేశాలకు దాచిన సొమ్మంతా రాష్ట్రానికి తీసుకొచ్చి, తద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడది మర్చిపోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తి స్థాయి విచారణ చేయకుండా వ్యవహరిస్తోంది.. బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతోందని, ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీని ఇక్కడి బీఆర్ఎస్ పార్టీ అప్రోచ్ అయిందని, అందుకే ఢిల్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కంట్రోల్ చేస్తోందని ఆరోపించారు. బీజేపీ మాత్రం ప్రధాన ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ, ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# జూన్‌లో 'సూపర్ స్పెషాలిటీ' ప్రారంభం

**మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): దక్షిణ తెలంగాణలో మహబూబ్ నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కేంద్ర బిందువుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపు, స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి అనంతరం ప్రసంగించారు. మహబూబ్ నగర్ అభివృద్ధిలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కృషి ఎన్నలేనిదని కొనియాడారు. వైద్య కళాశాలలో మెడికల్ సీట్ల పెంపు, పీజీ కోర్సుల విస్తరణ, విద్యార్థులకు వేర్వేరు హాస్టల్ సదుపాయాలు, ఆడిటోరియం నిర్మాణం వంటి వివిధ అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను జూన్ నెలలో ప్రారంభించేందుకు శరవేగంగా పనులు జరుగుతున్నవని ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం, ఆర్గన్ ట్రాన్స్ ప్లాంట్ రిట్రీవల్ సెంటర్, వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్ వంటి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం



సంకల్పించిందని మంత్రి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 21 డిపార్ట్మెంట్లకు అదనంగా మరో 14 డిపార్ట్మెంట్లను ఏర్పాటుచేసి, సర్జికల్ విభాగాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. టీచింగ్ ఫ్యాకల్టీ కొరతను తీర్చేందుకు భారీగా నియామకాలు చేపడుతున్నామని, ఇప్పటికే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. అలాగే టీచింగ్ హస్పిటల్ ప్రారంభంతో హాస్టల్స్, ఆడిటోరియం నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. వైద్య విద్యను బలోపేతం చేయడం, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం, వారి జీవన ప్రమాణాలు పెంచడంలో ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న వైద్య సమస్యలను పరిష్కరించేందుకు కట్టుదిట్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతుందని, అందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కృతనిశ్చయంతో ఉండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్ మమత, అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, హరిప్రియ, మూడా చైర్మెన్ లక్ష్మణ్ యాదవ్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ బెక్కెరి అనిత, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా, మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ రామానుజుల రెడ్డి, కార్పోరేటర్ సల్మాన్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ పెంపు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

# రేవంత్ గుంపు మేస్త్రీ

సీఎం లక్ష్యంగా కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు.



గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.

## తునికాకు సేకరణకు సర్కారు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): రూ.54.90కోట్లతో తునికాకు(బీడీ ఆకు) సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీం శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. 30 జిల్లాలో, 37 డివిజన్లలో ఆకు సేకరించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. కాళేశ్వరం సర్కిల్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ మంచిర్యాల్ సర్కిల్, బాసర సర్కిల్, రాజన్న సర్కిల్, భద్రాద్రి సర్కిల్, చార్మినార్ సర్కిల్ పరిధిలోని 104 యూనిట్లలో 1.22లక్షల స్టాండర్డ్ బ్యాగ్ ను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో స్టాండర్డ్ బ్యాగ్ కు రూ.3,300చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే తెలంగాణ ఫారెస్ట్ డవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(టీజీఎఫ్డీసీ) ద్వారా బీడీ ఆకు సేకరణ, అమ్మకాలు జరిపించనున్నారు. బీడీ ఆకు సేకరణ, అమ్మకాలలో ఫారెస్ట్ ఆఫీసర్లకు ఫైనాన్సియల్ పవర్స్ కూడా ఇచ్చారు.

## తాటాకు చప్పుళ్లకు బెదరం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూత ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

# వందే భారత్ రైళ్లకు భారీగా ప్రయాణికులు

## సికింద్రాబాద్-విశాఖపట్నం రూట్ దక్షిణాదిలో టాప్

సికింద్రాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 3.98 కోట్ల మంది ఈ సెమీ హైస్పీడ్ రైళ్లలో ప్రయాణించారు. అంతకుముందు ఏడాదితో (2.97 కోట్లు) పోలిస్తే ఇది 34 శాతం అధికమని రైల్వే మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ-వారణాసి మార్గంలో తొలిసారిగా ప్రారంభమైన వందే భారత్ సేవలు, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఇప్పటివరకు లక్షకు పైగా ట్రిప్పుల ద్వారా మొత్తం 9.1 కోట్ల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా దేశీయంగా తయారైన ఈ రైళ్లు వేగం, సామర్థ్యం, స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తున్నాయని రైల్వే శాఖ పేర్కొంది. దేశంలోని వివిధ మార్గాల్లో న్యూఢిల్లీ-వారణాసి కారిడార్ అత్యంత రద్దీగా ఉంది. ఈ మార్గంలో ఇప్పటివరకు 73 లక్షల మంది ప్రయాణించారు. ఇక న్యూఢిల్లీ-శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా మార్గంలో 56 లక్షల మంది ప్రయాణించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకానికి ఈ రైళ్లు ఎంతగానో దోహదపడుతున్నాయని స్పష్టమవుతోంది. దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మధ్య నడిచే సికింద్రాబాద్-విశాఖపట్నం మార్గంలో 48 లక్షల మంది ప్రయాణించారు. చెన్నై-మైసూరు మార్గంలో 36 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఈ రైళ్ల ద్వారా ప్రధాన మత, సాంస్కృతిక, తీరప్రాంత పర్యాటక కేంద్రాలకు కనెక్టివిటీ మెరుగుపడి స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతం లభించింది. ఇదే క్రమంలో, సుదూర ప్రయాణికుల కోసం ఈ ఏడాది జనవరిలో ప్రవేశపెట్టిన వందే భారత్ స్లీపర్ సర్వీసులకు కూడా భారీ డిమాండ్ కనిపిస్తోంది. కేవలం మూడు నెలల్లోనే 1.21 లక్షల మంది ఈ సర్వీసుల్లో ప్రయాణించగా, ఆక్యుపెన్సీ రేటు 100 శాతానికి పైగా నమోదు కావడం విశేషం.



## హైదరాబాద్ - విజయవాడ మధ్య 'ఫ్లై 91' విమాన సర్వీసులు

విజయవాడ, ఏప్రిల్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే ప్రయాణికులకు ఒక శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ 'ఫ్లై 91' తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య తన నూతన సర్వీసులను అధికారికంగా ప్రారంభించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ సర్వీసును శుక్రవారం శ్రీకాకుళం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ - విజయవాడ మార్గంలో ఈ అదనపు సర్వీసు ప్రయాణికులకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సామాన్యులకు సైతం విమాన ప్రయాణాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ తక్కువ ధరలో వేగవంతమైన సేవలను అందిస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా టైర్-2, టైర్-3 నగరాలను అనుసంధానించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సామాన్యులు కూడా విమానం ఎక్కాలన్న ప్రధాని మోదీ కల నిజమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.






# కుటుంబ విలువలు కాపాడుకోవాలి

**జగిత్యాలలో మహిళా చైతన్య బైక్ ర్యాలీ**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను పరిరక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా హిందూ మహిళ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలో మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. విద్యానగర్ రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ధరూర్ క్యాంపు కోదండ రామాలయం వరకు సాగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ప్రపంచంలోనే గొప్పదని, కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సంఘటితంగా ఉండి హిందూ విలువల ఆధారంగా కుటుంబాలను తీర్చిదిద్దాలని, పిల్లలను విదేశీ సంస్కృతికి దూరంగా పెంచాలని సూచించారు. కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్వదేశీ జీవన విధానాన్ని అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ లెక్చరర్ జ్యోత్స్న, హిందూ మహిళా వేదిక, సేవికాసమితి ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా సర్కార్: అడ్లూరి

గొల్లపల్లి, ఏప్రిల్ 10 (ఈవార్తలు) రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. డీసీఎంఎస్‌ల ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు..శుక్రవారం గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో ఈ ఏడాది మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు..ప్రస్తుతం దళారులు క్వింటాలుకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.





# కొండగట్టు అంజన్న దర్శనానికి సాయి ధరమ్ తేజ్

మల్యాల, ఏప్రిల్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని ప్రముఖ తెలుగు సినీ నటుడు సాయి ధరమ్ తేజ్ శుక్రవారం.సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సాయి ధరమ్ తేజ్ మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎస్. అంజనారెడ్డి శాలువా కప్పి సత్కరించి, లడ్డూ ప్రసాదం అందించారు.

# అడువాల జ్యోతికి కీలక బాధ్యతలు

**కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కర్తగా నియామకం**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): జగిత్యాల మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్‌కు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కీలక బాధ్యతలు అప్పగించారు. వెలచ్చేరి శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికల సమన్వయకర్తగా ఆమెను అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ నియమించినట్లు ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ బాధ్యతల్లో భాగంగా పార్టీ కార్యక్రమాల సమన్వయం, స్థానిక నాయకత్వంతో కలిసి పనిచేయడం, ప్రచార కార్యక్రమాల రూపకల్పన మరియు అమలు, అలాగే రైతులు మరియు గ్రామీణ ఓటర్లకు పార్టీ విధానాలను చేరవేయడం వంటి కీలక అంశాలను ఆమె నిర్వహించనున్నారు. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ ఆలోచనలు, రైతు సమస్యలు మరియు పార్టీ అభ్యర్థి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నారు. ఈ నియామకం ఆమెకు ఉన్న అనుభవం, పార్టీపై ఉన్న నమ్మకానికి గుర్తింపుగా పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆమె నాయకత్వంలో వెలచ్చేరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ కోఆప్షన్ పదవికి నామినేషన్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కో ఆప్షన్ సభ్యునిగా మైనార్టీ కోటాలో అవకాశం కల్పించాలని కోరుతూ శుక్రవారం మాజీ కౌన్సిలర్, సెంట్రల్ ముస్లిం కమిటి అధ్యక్షుడు ఎంఏ. బారీ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యునిగా అవకాశం కల్పిస్తే జగిత్యాలలో ముస్లిం మైనార్టీలకు రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు తనవంతుగా పోరాటం చేస్తానని, మైనార్టీలకు హామీ ఇచ్చిన విధంగా ఈద్గా కొరకు 10 ఎకరాల స్థలం, దూదేకుల సంఘానికి 20 గుంటల స్థలాన్ని కేటాయించడానికి, ముస్లిం స్మశాన వాటికల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

# మైనర్లు వాహనాలు నడిపితే కేసులు

**ధర్మపురి ఎస్సై మహేశ్ హెచ్చరిక**

ధర్మపురి, ఏప్రిల్ 10 (ఈవార్తలు): మైనర్లు వాహనాలతో రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని ధర్మపురి ఎస్ఐ మహేష్ హెచ్చరించారు శుక్రవారం ధర్మపురి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద వాహన తనిఖీలు చేశారు.మైనర్ లు వాహనాల నడుపుతున్న 11 వాహనాలను పోలీస్ స్టేషన్కు తరలించారు.మైనర్ లు వాహనాలతో రోడ్డుపైకి వస్తే వస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్ లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, కానిస్టేబుల్ రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల కోసం వాటర్ కూలర్ ప్రారంభం

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): జనగణమన మిత్ర బృందం ఆధ్వర్యంలో స్వర్గీయ ఉటూరి గంగారాం-సరోజన దంపతుల జ్ఞాపకార్థం పాత బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రజలు ఇటువంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం కల్పన, జనగణమన నిర్వాహకులు గంగాధర్, కౌన్సిలర్లు పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, క్యాదాసు నవీన్, నాయకులు బండారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులు ప్రారంభించాలి

**ఎంపీడీవోకు గాండ్ల జ్యోతి వినతి**

మల్యాల, ఏప్రిల్ 10 (ఈవార్తలు): మల్యాల మండల కేంద్రంలో గత నెల రోజులుగా నిలిచిపోయిన ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించాలని 16వ వార్డు సభ్యురాలు గాండ్ల జ్యోతి ఎంపీడీవో స్వాతి గారిని విజ్ఞప్తి చేశారు. పనులు ఆగిపోవడంతో దాదాపు 300 మంది కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. గ్రామంలోని పేద కుటుంబాలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, పనులు నిలిచిపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి మరింత దెబ్బతింటోందని తెలిపారు. కూలీల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే పనులు పునఃప్రారంభించి వారికి ఉపాధి కల్పించాలని ఆమె కోరారు.

# మాట నిలబెట్టుకున్న దారం ఆదిరెడ్డి

**కొండగట్టు భక్తుల కష్టాలు తీర్చిన సర్పంచ్**

**దశాబ్ద కాలపు ఆక్రమణలు తొలగింపు**

**సులభ్ కాంప్లెక్స్ పునఃప్రారంభం**



మల్యాల, ఏప్రిల్ 10 (ఈవార్తలు): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ముత్యంపేటలో భక్తుల దశాబ్దాల కల నెరవేరింది. ఎన్నో ఏళ్లుగా ఆక్రమణల చెరలో చిక్కి, వినియోగానికి నోచుకోక మూతపడిన 'సులభ్ కాంప్లెక్స్' దారిని పునరుద్ధరించి గ్రామ సర్పంచ్ దారం ఆదిరెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. మంత్రి సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకుని, భక్తుల ఇబ్బందులను తొలగించిన సర్పంచ్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఘనంగా సన్మానించారు.కొండగట్టుకు వచ్చే వేలాది మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు శౌచాలయ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. సులభ్ కాంప్లెక్స్ ఉన్నప్పటికీ, దానికి వెళ్లే దారి కబ్జాకు గురవడంతో అది నిరుపయోగంగా మారింది. ఈ సమస్యపై ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా కమిటీ ఏడాది కాలంగా అలుపెరగని పోరాటం చేస్తూ, అధికారులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఇటీవల జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొండగట్టు పర్యటనలో ఈ విషయాన్ని కమిటీ నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ సమయంలోనే సర్పంచ్ ఆదిరెడ్డి స్పందిస్తూ.. ఈ సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని మంత్రి సమక్షంలోనే బాధ్యత తీసుకున్నారు. సర్పంచ్ ఆదిరెడ్డి, ఉపసర్పంచ్ ముత్యంరెడ్డి పర్యవేక్షణలో జేసీబీలతో ఆక్రమణలను కూల్చివేయించి దారిని సుగమం చేయడమే కాకుండా, మూతపడిన సులభ్ కాంప్లెక్స్‌ను పునఃప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు."ప్రజల కష్టాలను తన కష్టంగా భావించే నాయకులే నిజమైన ప్రజా ప్రతినిధులు. ఇచ్చిన మాట కోసం మొండిగా నిలబడి, అక్రమ నిర్మాణాలను తొలగించి భక్తులకు మేలు చేసిన సర్పంచ్ ఆదిరెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సి జగిత్యాల జిల్లా అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూట శేకర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి సామల లక్ష్మీనారాయణ, నాయకులు కోల రాజేశం గౌడ్, గుగ్గిళ్ళ సత్యనారాయణ, లింగమూర్తి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 6 రోజులు రోడ్డు భద్రత కార్యక్రమాలు

**జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



జగిత్యాల టౌన్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపు లక్ష్యంగా "అరైవ్.. అలైవ్" కార్యక్రమాన్ని ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మొదటి రోజున గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ సభల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. రెండవ రోజు అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నియమాలపై ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపడతారు. మూడవ రోజు "రోడ్ సేఫ్టీ డే"గా నిర్వహించి విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తారు. నాలుగవ రోజు సోషల్ మీడియా ద్వారా యువతలో చైతన్యం పెంచేందుకు ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తారు. ఐదవ రోజు "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యతపై ఫస్ట్ రెస్పాండర్లకు శిక్షణ ఇస్తారు. చివరి రోజును "జీరో ఎన్ఫోర్స్మెంట్ డే"గా నిర్వహించి శిక్షలకంటే కౌన్సెలింగ్ ద్వారా అవగాహన పెంపుపై దృష్టి సారిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ముఖ్యంగా యువత చురుకుగా పాల్గొని రోడ్డు భద్రతకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# మచిలీపట్నంలో 17 ఆవు దూడల స్వాధీనం

**ఇద్దరిపై కేసు నమోదు**

కాకినాడ, ఏప్రిల్ 10 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు మచిలీపట్నంలో నిర్వహించిన తనిఖీల్లో 17 ఆవు దూడలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తుని సమీపంలోని నామవరం సంతలో కొనుగోలు చేసిన ఆవు దూడలను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మచిలీపట్నం వద్ద వాహనాలను తనిఖీ చేయగా, అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాల్లో 17 ఆవు దూడలు గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా ఆవు దూడలను తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో సంబంధం ఉన్న ఇద్దరిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న ఆవు దూడలను సమీప గోశాలలో తరలించినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా పశువుల రవాణాపై కఠిన చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు.



# కాలభైరవాష్టమి సందర్భంగా ధన్వంతరి ఆలయంలో పూజలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవాష్టమి సందర్భంగా మాతలు కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం, అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత,గాల్లిపెల్లి సుజాత, మాధురి, రజిత, ప్రసన్న, హర్షిణి, గంగవ్వ, అర్చకుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

న్యూఢిల్లీ: ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# మంత్రులకు చంద్రబాబు వార్నింగ్

**ఇంకో సారి రిపీట్ కాకూడదంటూ హెచ్చరిక**

అమరావతి, ఏప్రిల్ 10 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా, ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు, అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది.

# ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి

మల్యాల, ఏప్రిల్ 10 (ఈవార్తలు): మల్యా ల మండలంలోని మద్దుట్ల గ్రామంలో సాగు చేస్తున్న అవకాడో (వెన్న పండు) తోటలను జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సాగు విధానం మరియు పంట ఎదుగుదలపై రైతులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సాంప్రదాయ పంటలకు భిన్నంగా అవకాడో వంటి ఉద్యానవన పంటలను సాగు చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఆమె రైతులకు సూచించారు. మార్కెట్‌లో అవకాడోకు మంచి డిమాండ్ ఉన్నందున, రైతులు ఇటువంటి లాభదాయకమైన పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిల్, స్థానిక రైతులు మరియు ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ముత్యంపేటకు చేరిన భద్రాద్రి రామయ్య అక్షింతలు

మల్యాల, ఏప్రిల్ 10 (ఈవార్తలు): మల్యాల మండలం ముత్యంపేట గ్రామనికి దక్షిణ అయోధ్యగా పిలువబడే భద్రాచలం పుణ్యక్షేత్రం నుంచి రాములవారి పవిత్ర తలంబ్రాలు (అక్షింతలు) శుక్రవారం గ్రామానికి చేరుకున్నాయి. గ్రామంలోకి అక్షింతల రాకతో ముత్యంపేట పురవీధులన్నీ ఆధ్యాత్మిక పరిమళంతో నిండిపోయాయి. ఇది గ్రామస్తులందరికీ ఎంతో శుభసూచకమని, గ్రామానికి పట్టిన పీడలు తొలగి సకల శుభాలు కలుగుతాయని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచల క్షేత్రంలో విశేష పూజలు అందుకున్న పవిత్ర అక్షింతలు ఇవి గ్రామస్తులందరూ భక్తిశ్రద్ధలతో ఈ పవిత్ర అక్షింతలను స్వీకరించి, తమ ఇళ్లలో ఉంచుకోవాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం కోరింది.

# సాఫ్ట్ వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 10 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్లైన్లో ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లార్నింగ్ బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, పైథాన్, డేటా సైన్స్ బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్, బ్లాక్ చైన్ వంటి 100కి పైగా కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నట్లు తెలిపారు.

# ఇంటర్ విద్యార్థిని గొంతుకోసి చంపిన యువకుడు

కడప, ఏప్రిల్ 10 (ఈవార్తలు): కడప జిల్లాలోని ఖాజీపేటలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంటర్ చదువుతున్న ఓ విద్యార్థినిని ఓ యువకుడు గొంతు కోసి కిరాతకంగా హత్య చేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం జరగగా, స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళితే... ఖాజీపేటకు చెందిన కీర్తన ఇంటర్మీడియట్ చదువుతోంది. పరీక్షలు పూర్తికావడంతో ఇంటి వద్దే ఉంటోంది.

# అమెరికా 1800 కోట్ల డ్రోన్ మిస్సింగ్

ఇరాన్ కాల్పుల తర్వాత అదృశ్యం



కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత హర్మూజ్ జల సంధి సమీపంలో అమెరికా నౌకాదళానికి చెందిన అత్యంత విలువైన డ్రోన్ అదృశ్యం కలకలం రేపుతోంది. ఎంక్యూ-4సీ ట్రైటాన్ నిఘా డ్రోన్ శుక్రవారం ఇరాన్ కాల్పులు జరిపిన తరువాత అదృశ్యమైనట్టు తెలుస్తోంది. ఫ్లైట్ రాడార్ 24 ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఆ డ్రోన్ పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిపై సుమారు మూడు గంటల పాటు నిఘా పూర్తి చేసి, ఇటలీలోని సిగోనెల్లా నావల్ ఎయిర్ స్టేషన్‌లో ఉన్న తన స్థావరానికి తిరిగి వెళ్తున్నట్లు కనిపించింది. **ఆ డ్రోన్ అత్యవసర సమయంలో పంపే 7700 కోడ్ పంపి, వేగంగా కిందకు పడిపోయినట్టు చూపింది. ఈ మానవరహిత నిఘా డ్రోన్ అదృశ్యం కావడానికి ముందు వేగంగా ఎత్తు నుంచి కిందకు కూలిపోవడం గమనించారు. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరి, హర్మూజ్ జల సంధిని తిరిగి తెరవడానికి టెహ్రాన్ అంగీకరించిన వేళ.. ఈ పరిణామం చోటుచేసుకుంది.**

## ఇరాన్‌పై యుద్ధం ఖర్చు

స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం.. ఇరాన్ యుద్ధంలో అమెరికా సెకెనుకు 10,300 డాలర్లు (అంటే రూ.9.8 లక్షలు) ఖర్చు చేస్తోంది. వీటిలో ఆయుధాలు, క్షిపణులదే (36 శాతం) సింహభాగం. వీటి ఖర్చు రోజుకు సుమారు 320 డాలర్లు (దాదాపు రూ.3040 కోట్లు). వైమానిక కార్యకలాపాల (27.5 శాతం) కోసం రోజుకు 245 మిలియన్ డాలర్లు (రూ.2,327.5 కోట్లు), నేవీ ఆపరేషన్స్ సుమారు 155 మిలియన్ డాలర్లు (రూ.1,472.5 కోట్లు). థాడ్, పేట్రియాట్ బ్యాటరీలు, ఏజిస్ బీఎండీ ఇంటర్‌సెప్టర్ల వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలకు రోజుకు సుమారు 95 మిలియన్ డాలర్లు (రూ. 902.5 కోట్లు) ఇది మొత్తం రోజువారీ ఖర్చులో 10.7 శాతం. నిఘా, సైబర్ కార్యకలాపాలకు రోజుకు సుమారు 45 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 427.5 కోట్లు) ఖర్చవుతుంది. సిబ్బంది, లాజిస్టిక్స్‌కు రోజుకు సుమారు 30 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 285 కోట్లు) ఖర్చుచేస్తోంది.





## ఎంక్యూ-4సీ ట్రైటాన్ విశేషాలు

అమెరికా వద్ద ఉన్న ఖరీదైన డ్రోన్లలో ఇదీ ఒకటి. దీని విలువ 200 మిలియన్ల కంటే ఎక్కువ ( దాదాపు రూ.1850 కోట్లు). గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సెంట్రల్ కమాండ్ పరిధిలో దీనిని మోహరించారు. సాధారణ విమానంలా కాకుండా సముద్ర జలాల్లో పర్యవేక్షణ కోసం రూపొందించిన ఈ డ్రోన్.. గంటల తరబడి నిఘా నిర్వహించగలదు. 50 వేల అడుగుల ఎత్తులో 24 గంటలకుపైగా ఎగరగలిగే ఒకే ఒక్క స్వయం ప్రతిపత్తి డ్రోన్ ఇది. సాంప్రదాయ ఇంధన విమానాలకు భిన్నంగా.. ట్రైటాన్ ఏకకాలంలో 7,400 నాటికల్ మైళ్లు ప్రయాణించగలడం ప్రత్యేకత. 2025 నాటికి అమెరికా నౌకాదళం వద్ద 20 డ్రోన్‌లు ఉండగా.. మరో ఏడింటిని కోనుగోలు చేసే యోచనలో ఉంది. హర్మూజ్ జల సంధిని ఇరాన్ తెరవదానకి అంగీకరించిన 48 గంటల తర్వాత డ్రోన్ అదృశ్యమైంది.

## స్విగ్గీ నుంచి నందన్ రెడ్డి అవుట్

ముంబై: ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కంపెనీ సహ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం నుంచి ఆయన రాజీనామా తక్షణమే అమల్లోకి వచ్చినట్లు కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో అధికారికంగా ప్రకటించింది. సొంతంగా మరో స్టార్టప్‌ను ప్రారంభించే లక్ష్యంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. స్విగ్గీ ప్రారంభ రోజుల్లో సీఈఓ శ్రీహర్ష మాజేటితో కలిసి కార్యకలాపాలు నెలకొల్పడంలో నందన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. కంపెనీలో అనేక హోదాల్లో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో స్విగ్గీ ఏఐ ఆధారిత కన్సియర్జ్ సర్వీస్ 'క్రూ'కు నాయకత్వం వహిస్తున్నారు. ఆయన నిష్క్రమణతో ప్రస్తుతానికి ఈ బాధ్యతలను వైస్ ప్రెసిడెంట్ ఆకాశ్ భోటికా పర్యవేక్షించనున్నారు. 2020లో రాహుల్ జైమినీ వైదొలిగిన తర్వాత, కంపెనీని వీడిన రెండో సహ వ్యవస్థాపకుడు నందన్ రెడ్డి కావడం గమనార్హం. ఆయన రాజీనామాపై సీఈఓ శ్రీహర్ష మాజేటి స్పందిస్తూ, స్విగ్గీ ప్రస్థానంలో నందన్ రెడ్డి ఒక దార్శనిక శక్తి అని కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని, కానీ భవిష్యత్తులో ఆయన చేపట్టబోయే ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలి కాలంలో స్విగ్గీలో ఉన్నత స్థాయి మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొద్ది వారాల క్రితమే ఇన్వెస్టర్ రిలేషన్స్ హెడ్ అభిషేక్ అగర్వాల్ రాజీనామా చేయగా, ఇప్పుడు బోర్డు స్థాయిలోనూ మార్పులు జరుగుతున్నాయి. స్విగ్గీలో అతిపెద్ద వాటాదారు అయిన ప్రోసస్ నామినీ డైరెక్టర్‌గా రోజర్ క్లార్క్ స్థానంలో రెనన్ డి కాస్ట్రో అల్వేస్ పింటో రానున్నారు. అదే సమయంలో, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ ఫణి కిషన్, సీఎఫ్ఓ రాహుల్ బోత్రాలను బోర్డు సభ్యులుగా చేర్చుకోవాలని స్విగ్గీ ప్రతిపాదించింది.

## నేటితో యూపీఐకి పదేళ్లు

### లావాదేవీల్లో 12,000 రెట్ల వృద్ధి

న్యూఢిల్లీ: భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఏప్రిల్ 11తో పదేళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ దశాబ్ద కాలంలో లావాదేవీల పరిమాణంలో 12,000 రెట్లు, విలువ పరంగా 4,000 రెట్లకు పైగా అసాధారణ వృద్ధిని నమోదు చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.78 కోట్ల లావాదేవీలతో (విలువ రూ. 6,952 కోట్లు) మొదలైన యూపీఐ ప్రస్థానం.. 2025-26 నాటికి 21,898 కోట్ల లావాదేవీలకు (విలువ దాదాపు రూ. 285 లక్షల కోట్లు) చేరింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత డిజిటల్ చెల్లింపుల వినియోగం విపరీతంగా పెరగడంతో యూపీఐ వృద్ధి అమాంతం పెరిగింది. మర్చంట్ క్యూఆర్ కోడ్‌లు, పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్ సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఇటీవల మార్చి 2026లో యూపీఐ తన ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది.

# బలపడిన రూపాయి



ముంబై: శుక్రవారం ఫారెక్స్ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ బలపడింది. ఉదయం రూపాయి దాదాపు 10 పైసలు లాభపడి 92.57 వద్ద ట్రేడ్ అవుతోంది. గురువారం ముగింపు ధర 92.66గా ఉంది. బ్యాంకులు తమ ఆర్బిట్రేజ్ పొజిషన్లను రద్దు చేసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విధించిన గడువు శుక్రవారంతో ముగియటమే ఇందుకు ప్రధాన కారణం. ఆఫ్‌షోర్ నాన్-డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్‌డీఎఫ్) మార్కెట్‌లో బ్యాంకుల మితిమీరిన లావాదేవీలను నియంత్రించేందుకు ఆర్బీఐ గత నెలలో కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పనిదినం ముగిసేసరికి బ్యాంకు నికర ఓపెన్ పొజిషన్ 100 మిలియన్ డాలర్లకు మించరాదని స్పష్టం చేసింది. ఈ గడువును పొడిగించాలని పలు బ్యాంకులు కోరినప్పటికీ, ఆర్బీఐ అందుకు అంగీకరించలేదు. దీంతో బ్యాంకులు తమ పొజిషన్లను సరిచేసుకుంటున్నాయి. ఆర్బీఐ తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మార్కెట్ వేచి చూసే ధోరణిలో ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరుగుతుండటం ట్రేడర్లను ఆందోళనకు గురిచేస్తోంది. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 1.13 శాతం పెరిగి 97 డాలర్ల వద్ద ఉండగా, యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ 1శాతానికి పైగా పెరిగి 99.24 డాలర్లకు చేరింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ 20 ఫ్యూచర్స్ ధర 3.23 శాతం పెరిగి రూ. 9,222 వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ పరిణామాలపై ఇటీవల ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ, విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో అస్థిరతను అరికట్టేందుకే బ్యాంకులపై ఈ ఆంక్షలు విధించామని, ఇవి తాత్కాలిక చర్యలు మాత్రమేనని స్పష్టం చేశారు. బ్యాంకులు చేస్తున్న ఆర్బిట్రేజ్ ట్రేడ్‌ల వల్లే ఇటీవలి కాలంలో మార్కెట్‌లో ఒడిదొడుకులు పెరిగాయని ఆయన పేర్కొన్నారు.


# పాక్ బయల్దేరిన జేడీ వాన్స్



వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నడుమ చర్చల ప్రక్రియకు మార్గం సుగమమవుతోంది. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం పాకిస్థాన్‌కు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరాన్ నిజాయతీతో చర్చలకు వస్తే స్నేహ హస్తం అందించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ మోసపూరితంగా వ్యవహరించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇస్లామాబాద్‌కు బయల్దేరే ముందు జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. "చర్చల కోసం మేం ఎదురుచూస్తున్నాం. ఇవి సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లుగా, ఇరాన్ నిజాయతీతో చర్చలకు వస్తే మేం తప్పకుండా స్నేహ హస్తం అందిస్తాం. అదే సమయంలో, మాతో ఆటలాడాలని చూస్తే మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండబోదని వాళ్లు తెలుసుకోవాలి" అని వాన్స్ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ నిర్దేశించిన స్పష్టమైన మార్గదర్శకాలతోనే తాము చర్చలకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, వాన్స్ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అధికారులు ఇంకా విడుదల చేయలేదు. గల్ఫ్ ప్రాంతంలో స్థిరత్వం, ఇంధన సరఫరా వంటి అంశాల కారణంగా ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది. గతంలో ఇరు దేశాల మధ్య జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో, తాజా ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో వేచి చూడాలి.

## నమాజ్ కోసం దాడిని వాయిదా వేశాం

### ఆపరేషన్ సిందూర్ రహస్యాలు వెల్లడించిన ఆర్మీ చీఫ్




న్యూఢిల్లీ: భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఒక కీలక విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాద శిబిరంపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడి చేసేందుకు సిద్ధమైనప్పుడు, అక్కడ ఉగ్రవాదులు నమాజ్ చేస్తున్నారని తెలిసి దాడిని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసినట్లు తెలిపారు. సైనిక లక్ష్యాలతో పాటు మానవతా విలువలకు కూడా ప్రాధాన్యం ఇస్తామని చెప్పడానికి ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రిషభ్ షా హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఐఐఎంయూఎన్ వారి 'బిఫోర్ ఐ బికేమ్ మీ' అనే పాడ్‌కాస్ట్‌లో జనరల్ ద్వివేది మాట్లాడారు. "మేము ఆ లక్ష్యాలను ఎప్పుడైనా ధ్వంసం చేయవచ్చు. కానీ, అవతలి వైపు ఉగ్రవాద శిబిరంలో వారు నమాజ్ చేస్తున్న సమయంలో దాడి చేయకూడదని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే అందరి దేవుడు ఒక్కడే. అందుకే వారు ప్రార్థనలో లేని సమయాన్ని ఎంచుకున్నాం" అని ద్వివేది వివరించారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితం, నాయకత్వ శైలి గురించి కూడా ఆయన పంచుకున్నారు. సైన్యంలో మహిళల చేరిక, పని వాతావరణం వంటి విషయాల్లో తన కుమార్తెలు మార్గనిర్దేశం చేస్తారని తెలిపారు. "వారు చెప్పే విషయాలను నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. అవసరమైన చోట వాటిని అమలు చేస్తాను. వారే నాకు ఈ మార్పులను ఎలా స్వీకరించాలో నేర్పారు" అని ఆయన అన్నారు. తన సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ రోజుల గురించి మాట్లాడుతూ, మార్కుల కన్నా వైఖరి, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడమే ముఖ్యమని జనరల్ ద్వివేది అభిప్రాయపడ్డారు. "మార్కులు కేవలం చదువులోని ప్రతిభకు సూచిక మాత్రమే, అవి మీ వ్యక్తిత్వాన్ని నిర్ధారించలేవు" అని ఆయన వ్యాఖ్యానించారు. అత్యంత క్లిష్టమైన కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్లలో నైతిక సందిగ్ధత ఎదురైనప్పుడు, ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడానికి భగవద్గీత, ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలు ఎంతగానో సహాయపడతాయని జనరల్ ద్వివేది తెలిపారు.

## పరుగులు తీసిన సూచీలు

ముంబై: ఒకరోజు విరామానికి తెరదించుతూ దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ లాభాల బాట పట్టాయి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తున్నప్పటికీ, దేశీయంగా కొనుగోళ్ల మద్దతు కొనసాగడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 918.6 పాయింట్లు పెరిగి 77,550.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 275.5 పాయింట్లు లాభపడి 24,050.6 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 77,622.50, నిఫ్టీ 24,074.05 వద్ద ఇంట్రాడే గరిష్ఠాలను తాకాయి. ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి హెవీవెయిట్ షేర్లు లాభపడటం సూచీల పెరుగుదలకు దోహదపడింది. బెంచ్‌మార్క్ సూచీలను మించి బ్రాడర్ మార్కెట్లు రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.48 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.67 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే మిశ్రమ ప్రదర్శన కనబరిచాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరగడంతో నిఫ్టీ ఐటీ సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. మరోవైపు, నిఫ్టీ ఆటో, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు మిగిలిన వాటితో పోలిస్తే వెనకబడ్డాయి. ఉదయం సెషన్ ప్రారంభంలో కూడా ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు లాభాలతోనే మొదలయ్యాయి.

### పామునైనా నమ్మొచ్చు కానీ..!

## బీజేపీని నమ్మలేం : మమత



కోల్‌కతా: ఈశాన్య రాష్ట్రాల ప్రజల నుంచి ఓట్లను సాధించగలమన్న నమ్మకం కోల్పోయినందునే బీజేపీ అస్సాం ఎన్నికల కోసం వెలుపల నుంచి ప్రజలను తీసుకువచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని తెంతులియా వద్ద ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కింద దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలు నిష్పాక్షికతను కోల్పోయాయని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను బీజేపీ కొనేసిందంటూ ఆమె ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఓ రైలు నిండా 50,000 మందిని అస్సాంకు తీసుకువచ్చారు అని ఆమె ఆరోపించారు. పామునైనా నమ్మొచ్చునేమో కాని బీజేపీని మాత్రం కాదని ఆమె విమర్శించారు.

## నల్లగా ఉన్నాడని భర్తను చంపింది

భోపాల్: భర్త నల్లగా ఉన్నాడని ఓ భార్య ప్రియుడితో కలిసి అతడిని దారుణంగా హతమార్చిన ఘటన మధ్యప్రదేశ్‌లో జరిగింది. ప్రియుడితో వివాహేతర సంబంధం బయట పడటంతో ఆమె సుపారీ గ్యాంగ్‌తో భర్తను చంపించింది. అయితే దొంగల దాడిలో తన భర్త చనిపోయాడని పోలీసులను నమ్మించేందుకు ప్రయత్నించి చివరికి కాల్ డాటాతో దొరికిపోయింది. పోలీసుల కథనం ప్రకారం.. ధార్ జిల్లాకు చెందిన దేవకృష్ణ రోహిత్(28), ప్రియాంక(25) భార్యాభర్తలు. ఈ నెల 7న దుండగులు ఇంట్లో చొరబడి తనను కట్టేసి తన భర్తను హత్య చేసి ఇంట్లోని నగలు, నగదు దోచుకెళ్లారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే దొంగతనం జరగలేదని పోలీసుల దర్యాప్తులో తేలడంతో పోలీసులు అనుమానంతో ప్రియాంకను గట్టిగా ప్రశ్నించారు. ఆమె పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆమె కాల్ డాటాను పరిశీలించి ఆమెకు కమలేశ్ అనే వ్యక్తితో 2020 నుంచి వివాహేతర సంబంధం ఉన్నట్టు తెలుసుకున్నారు. రోహిత్ నల్లగా ఉన్నాడని.. అతడి కన్నా మంచి రంగు ఉన్నవాడు తనకు కావాలని తరచూ ప్రియాంక అతడితో గొడవ పడేదని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఈవీఎంలకు డయాగ్నోస్టిక్ టెస్ట్

### 16, 17న నిర్వహణ.. బాంబే హైకోర్టు చారిత్రక తీర్పు



ముంబై: ఎన్నికల ప్రక్రియ పారదర్శకతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లపై బాంబే హైకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. ముంబైలోని చాందివాలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంలకు ఏప్రిల్ 16, 17 తేదీల్లో డయాగ్నొస్టిక్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ మాజీ మంత్రి నసీమ్ ఖాన్ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. దేశ ఎన్నికల చరిత్రలో ఇటువంటి సాంకేతిక పరీక్ష జరగడం ఇదే మొదటిసారి. 'ఇది ప్రజాస్వామ్య విజయానికి తొలి అడుగు. ఈవీఎంల విశ్వసనీయతపై మేము లేవనెత్తిన ప్రశ్నలకు ఇప్పుడు సాంకేతిక ముద్ర లభిస్తుంది. ఏప్రిల్ 16, 17 తేదీల్లో జరగనున్న ఈ విచారణ ద్వారా ప్రజల ముందు నిజం బయటపడుతుంది అని పిటిషనర్ నసీమ్ ఖాన్ అన్నారు. నసీమ్ ఖాన్ 20,625 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఏప్రిల్ 2024 నాటి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 5% ఈవీఎంలను ధృవీకరించడానికి ఒక నిబంధన ఉంది. దీని ప్రకారం, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)కు చెందిన నిపుణులైన ఇంజినీర్లు చాందివాలిలోని వీవీప్యాట్‌లో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, మైక్రో కంట్రోలర్‌ను తనిఖీ చేస్తారు. ఈ ప్రక్రియలో, యంత్రానికి చెందిన బర్న్ మెమొరీలోని డాటాను, వాస్తవ ఓటింగ్ డాటాను తనిఖీ చేస్తారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో, చాందివాలి నియోజకవర్గంలో శివసేన (షిండే వర్గం)కు చెందిన దిలీప్ లాండే, నసీమ్ ఖాన్ (కాంగ్రెస్)ను స్వల్ప తేడాతో ఓడించారు. అయితే, ఓట్ల లెకింపులో అవకతవకలు జరిగాయని పేర్కొంటూ ఖాన్ కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు న్యాయమూర్తి సోమశేఖర్ సుందరేశన్ దీనిపై విచారణకు ఆదేశించారు.

## వయ్యారి చిత్రం





## 'రాకా' కోసం అల్లు అర్జున్‌కు 175 కోట్లు!

**పైగా, లాభాల్లో 15 శాతం వాటా**

భారతీయ చలనచిత్ర రంగంలో ఎన్నడూ లేని విధంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న రాక చిత్రం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. దాదాపు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా పారితోషికాల విషయంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. పాన్ ఇండియా స్టార్‌గా అల్లు అర్జున్ క్రేజ్ .. జవాన్ చిత్రంతో అట్లీ అందుకున్న గ్లోబల్ సక్సెస్ వెరసి ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశానికి చేరాయి. ఈ సినిమా కోసం అల్లు అర్జున్ అందుకుంటున్న రెమ్యునరేషన్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజా సమాచారం ప్రకారం..ఈ ప్రాజెక్ట్ కోసం అతడు ఏకంగా 175 కోట్ల పారితోషికాన్ని డిమాండ్ చేశారు. కేవలం ఫిక్స్‌డ్ పారితోషికమే కాకుండా.. సినిమా లాభాల్లో 15 శాతం వాటాను కూడా దక్కించుకోబోతున్నారట. ఒకవేళ సినిమా ఊహించిన విధంగా విజయం సాధిస్తే.. ఈ చిత్రంతో బన్నీ ఆర్జించే మొత్తం 300 కోట్లు దాటే అవకాశం ఉంది. ఇది భారతీయ సినీ చరిత్రలో ఒక నటుడు అందుకునే అత్యున్నత స్థాయి పారితోషికంగా నిలవనుంది. దర్శకుడు అట్లీ పారితోషికం కూడా రాక కోసం భారీగా పెరిగింది. జవాన్ సినిమాకు 30 కోట్లు తీసుకున్న అట్లీ ఇప్పుడు అల్లు అర్జున్ సినిమా కోసం ఏకంగా 100 కోట్ల ఫీజు వసూలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

## 'బైకర్' కోసం రంగంలోకి పీవీ సింధు



టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ మూవీ 'బైకర్' ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. రేసింగ్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాకు ప్రేక్షకుల నుంచే కాకుండా, సెలబ్రిటీల నుంచి కూడా ప్రశంసలు అందుతున్నాయి. తాజాగా భారత బ్యాడ్మింటన్ స్టార్, ఒలింపిక్ విజేత పీవీ సింధు ఈ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు."ఒక స్పోర్ట్స్ అథ్లెట్‌గా ఈ సినిమా నాకు చాలా బాగా కనెక్ట్ అయ్యింది. ఇందులో చూపించిన వేగం, ఫోకస్, గెలవాలనే తపన చూస్తుంటే నాలోని ఎనర్జీ గుర్తుకొచ్చింది" అని రాసుకొచ్చారు.

## రష్మిక చెల్లెలూ ఎంట్రీ?



ప్రపంచవ్యాప్తంగా సిబ్లింగ్స్ డే (సోదర సోదరీమణుల దినోత్సవం) జరుపుకుంటున్న వేళ నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన వ్యక్తిగత జీవితంలోని ఒక మధురమైన జ్ఞాపకాన్ని అభిమానులతో షేర్ చేసుకున్నారు. తన చిన్నారి సోదరి శిమన్ మందన్నతో తనకు ఉన్న ప్రత్యేక అనుబంధాన్ని తెలియజేస్తూ ఇన్‌స్టాలో ఒక అందమైన బ్లాక్ అండ్ వైట్ ఫోటోను పోస్ట్ చేశారు. బహుశా ఈరోజు సిబ్లింగ్స్ డే అనుకుంటా.. అందుకే ఇదిగో అంటూ రష్మిక పెట్టిన సరదా క్యాప్షన్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గ్లామర్ ప్రపంచంలో ఎంత బిజీగా ఉన్నా.. తన మూలాలను.. కుటుంబ బంధాలను రష్మిక ఎంతగా గౌరవిస్తారో ఈ పోస్ట్ ద్వారా మరోసారి స్పష్టమైంది. అయితే రష్మికతో కలిసి ఒకే ఫ్రేమ్ లో కనిపించిన శిమన్ అందచందాలు యువతరాన్ని ఆకర్షించాయి. సిమన్ కూడా ఎంతో బ్యూటిఫుల్ గా ఉంది. ఒకవేళ నటనారంగంలోకి అడుగుపెడితే కథానాయికగా ఎదిగేందుకు ఛాన్సుందని ఈ ఫోటోని షేర్ చేసి వ్యాఖ్యల్ని జోడిస్తున్నారు. అయితే శిమన్ వయసు ఇంకా చాలా చిన్నది. తనకు కేవలం 14 వయసు. రష్మిక 16 ఏళ్లు పెద్దది. వయసు రీత్యా ఇద్దరి మధ్యా చాలా వ్యత్యాసం ఉంది. ప్రస్తుతం టీనేజ్ దశలో ఉన్న శిమన్ కేవలం విద్యాభ్యాసంపైనే దృష్టి సారించింది. అయితే తను కూడా నటనారంగంలోకి వచ్చి రష్మిక స్థాయిలో నేము, ఫేము సంపాదించాలనుకుంటే రెడ్ కార్పెట్ వేయడానికి పరిశ్రమలు సిద్ధంగా ఉన్నాయి. అయితే శిమన్ కి నటనపై ఆసక్తి ఉందా లేదా? అన్నది ఇంకా తెలియడం లేదు.

## సాయి దుర్గ తేజ్‌తో జోడీగా మానస వారణాసి?



మెగా హీరో సాయి దుర్గా తేజ్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ పాన్ ఇండియా లెవల్లో తన ముద్ర వేయాలని చూస్తున్న ఆయన, తాజాగా 'క' చిత్ర దర్శకులతో ఒక సినిమా చేయబోతున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రీసెంట్‌గా 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి సక్సెస్ అందుకున్న తెలుగమ్మాయి మానస వారణాసి ఈ రేసులో అందరికంటే ముందుండటం విశేషం. సాయి దుర్గా తేజ్ హీరోగా, సాహు గారపాటి నిర్మాణంలో రాబోతున్న ఈ కొత్త సినిమా కోసం కాస్టింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. చిత్ర యూనిట్ హీరోయిన్ పాత్ర కోసం మానస వారణాసిని సంప్రదించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్. ఇక ఒకవేళ ఇది నిజమైతే, మెగా హీరో సరసన నటించే గోల్డెన్ ఛాన్స్ మానసకు దక్కినట్లే. వీరిద్దరి కాంబినేషన్ వెండితెరపై చాలా ఫ్రెష్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారు.

## జన నాయగన్‌కు లీక్ బెడద



దళపతి విజయ్ నటించిన 50వ చిత్రం జన నాయకన్ థియేటర్లలో విడుదల కాకముందే పూర్తి వెర్షన్ పైరసీ సైట్లలో ప్రత్యక్షం కావడం ఇప్పుడు ఇండస్ట్రీని షాక్‌కు గురిచేసింది. గత కొంతకాలంగా పైరసీని అరికట్టేందుకు చిత్ర బృందాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా ఇలాంటి భారీ చిత్రాలు లీక్ అవ్వడం నిర్మాతలను కోట్లాది రూపాయల ఆర్థిక నష్టానికి గురిచేస్తోంది. ఇది కేవలం ఏ ఒక్క సినిమాకో సంబంధించిన సమస్య మాత్రమే కాదు.. మొత్తం సినిమా వ్యవస్థకే ఒక పెద్ద సవాల్‌గా పరిగణిస్తున్నారు. తమిళ్ రాకర్స్ మాఫియా వ్యక్తుల అరెస్ట్ ఆ తర్వాత ఐ బొమ్మ సృష్టికర్త అరెస్ట్ వంటివి పైరసీ ప్రభావాన్ని తగ్గిస్తాయనుకుంటే అది ఇంకా వటవృక్షంలా ఎదగడం ఆశ్చర్యపరుస్తోంది.



## మోనాలిసా భర్తపై పోక్సో కేసు

ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే స్టార్ అయిపోయిన మోనాలిసా, ఆ తర్వాత ఫర్మాన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే, తాజాగా ఈ ప్రేమ కథలో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఆమె మైనర్ అని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ తేల్చడంతో, ఈ వ్యవహారం కాస్తా పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళింది. మోనాలిసా పెళ్లి జరిగినప్పటి నుండి ఆమె వయస్సుపై అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డులను పరిశీలించగా, మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు స్పష్టమైంది. అంటే 2026 మార్చిలో పెళ్లి జరిగే నాటికి ఆమె వయస్సు కేవలం 16 ఏళ్ల రెండు నెలలు మాత్రమే. చట్ట ప్రకారం పెళ్లికి కావాల్సిన వయస్సు లేకపోవడంతో, ఆమె భర్త ఫర్మాన్ ఖాన్‌పై మహేశ్వర్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.



## బాధగా ఉంది: కృతి శెట్టి

తెలుగు చిత్రసీమలో ఉప్పెన సినిమాతో ఒక సంచలనంగా ఎంట్రీ ఇచ్చిన కృతి శెట్టి, బేబమ్మ పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది. కెరీర్ ప్రారంభంలోనే అలాంటి బలమైన పాత్ర దక్కడం ఆమెకు వరుస అవకాశాల దారులు తెరిచింది. అయితే, ఆ తర్వాత వచ్చిన సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోకపోవడం ఆమె ప్రయాణాన్ని కొంత మందగింపజేసింది. ఇప్పటివరకు తన ఫ్లాప్స్ గురించి ఎక్కువగా మాట్లాడని కృతి, తాజాగా మాత్రం తన మనసులోని భావాలను బయటపెట్టింది. తను నటించిన సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయనే బాధ కంటే, బేబమ్మ లాంటి బలమైన పాత్రలు మళ్లీ దక్కకపోవడమే తనకు ఎక్కువగా బాధ కలిగిస్తోందని చెప్పిన మాటలు ఆమె నిజాయితీని, తన పని పట్ల ఉన్న కమిట్‌మెంట్‌ను ప్రతిబింబిస్తున్నాయి. పని చేయడం మాత్రమే నా చేతిలో ఉంది, ఫలితం నా చేతిలో ఉండదని కృతి ఈ విషయంలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

## కంగనా వల్లే ఆర్జీవీలో మార్పు!





విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన పుట్టినరోజు వేడుకలను ముంబైలో చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ ఇప్పుడు సినిమా సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. కేక్ కట్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ.. నా గతాన్ని ఛధురంధర్2 అనే కత్తితో పొడుస్తున్నాను అని పేర్కొన్నారు. బాక్సాఫీస్ వద్ద వెయ్యి కోట్ల వసూళ్లతో ప్రభంజనం సృష్టిస్తున్న ధురంధర్: ది రివెంజ్ సక్సెస్ ఇచ్చిన ప్రేరణతో.. తన పాత వైఫల్యాలను చెరిపేసి సరికొత్తగా ప్రయాణం మొదలుపెట్టబోతున్నానని వర్మ ఈ వ్యాఖ్యల ద్వారా సంకేతాలిచ్చారు. వర్మ చేసిన ఈ సంచలన ప్రకటనకు బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ నుండి అద్భుతమైన మద్దతు లభించింది. వర్మ సినిమాల వల్ల తాము ఎంతగా ప్రభావితమయ్యామో కంగనా గుర్తుచేసుకోవడం ఆయనలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఒక మారుమూల పల్లెటూరులో ఉన్నప్పుడు.. అక్కడ థియేటర్లు లేకపోయినా వర్మ సినిమాల డీవీడీలు తెప్పించుకుని మరీ చూసేదాన్నని వివరించారు.





# బుడ్డోడు భళా!

## బెంగళూరుకు పీడ కల.. ఆర్ఆర్ విజయాల జోరు

**ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తమ జోరును కొనసాగిస్తోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఆ జట్టు విజయం సాధించింది. గౌహతి వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)ని చిత్తు చేసింది.**

**మరోవైపు వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో రాజస్థాన్ రాయల్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. తనకే సాధ్యమైన బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ బౌలర్లను ఊచకోత కోసాడు. వరల్డ్ బెస్ట్ బౌలర్లు అయిన జోష్ హజెల్ వుడ్, భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌ను చితక్కొట్టాడు.**

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసింది. కెప్టెన్ రజత్ పటీదార్(40 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించగా.. విరాట్ కోహ్లీ(16 బంతుల్లో 7 ఫోర్లతో 32), వెంకటేశ్ అయ్యర్(15 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 29 నాటౌట్) దూకుడుగా ఆడారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(2/33), రవి బిష్ణోయ్(2/32), బ్రిజేశ్ శర్మ(2/37) రెండేసి వికెట్లు తీయగా.. సందీప్ శర్మ(1/47), రవీంద్ర జడేజా(1/14) చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం రాజస్థాన్ రాయల్స్ 18 ఓవర్లలో 4 వికెట్లకు 202 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. వైభవ్ సూర్యవంశీ(26 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 78), ధ్రువ్ జురెల్(43 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 81 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆర్‌సీబీ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్(2/44), కృనాల్ పాండ్యా(2/30) రెండేసి వికెట్లు తీసారు. ఈ సీజన్‌లో ఆర్‌సీబీకి ఇదే తొలి పరాజయం కాగా.. రాజస్థాన్ రాయల్స్‌కు వరుసగా



నాలుగో విజయం. దాంతో ఆ జట్టు పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. వరుసగా వికెట్లు కోల్పోవడం ఆర్‌సీబీని దెబ్బతీసింది. దూకుడుగానే తమ ఇన్నింగ్స్ ప్రారంభించినా పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దాంతో ఇతర బ్యాటర్లు ఒత్తిడికి లోనై వికెట్లు పారేసుకున్నారు. చివరకు ఎక్స్‌ట్రా బ్యాటర్ కోసం ఇంపాక్ట్ ప్లేయర్‌గా వెంకటేశ్ అయ్యర్‌ను ఆడించాల్సి వచ్చింది. రజత్ పటీదార్ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో 201 పరుగుల పోరాడే లక్ష్యాన్ని అందుకున్నా.. సుయాశ్ శర్మ లేకపోవడంతో ఆర్‌సీబీ బౌలింగ్ బలహీనంగా మారిపోయింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వెంకటేశ్ అయ్యర్ ఆడటంతో సుయాశ్ శర్మ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. దానికి తోడు వైభవ్ విరుచుకుపడటంతో ఆర్‌సీబీ చేతులెత్తేసింది. 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన వైభవ్ సూర్యవంశీ.. ఫాస్టెస్ట్ సెంచరీ దిశగా సాగాడు. కానీ అతన్ని కృనాల్ బోల్తా కొట్టించాడు. వైభవ్ ఔటైనా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

## వైభవ్ వల్లే ఓడిపోయాం

పవర్‌ప్లేలో మేం దూకుడుగా ఆడిన విధానం, ఆరంభంలోనే వికెట్లు కోల్పోయినా **202** పరుగులు సాధించడం మాకు సానుకూల అంశాలు. అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లు, ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేసిన తీరు మా విజయవకాశాలను దెబ్బతీసింది. గత మ్యాచ్‌ల్లో మా ప్రదర్శన అద్భుతంగా ఉంది. అయితే ఈ ఓటమి నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. బౌలింగ్ మార్పుల గురించి నేను పెద్దగా ఆలోచించలేదు. ఎందుకంటే వెంకటేష్ అయ్యర్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా మాత్రమే నాకు ఆప్షన్స్‌గా ఉన్నారు. మేం ఈ ముగ్గురితోనే ఓవర్లను మేనేజ్ చేయాల్సి వచ్చింది. బౌలింగ్ మార్పులు ఈ మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేదని నేను అనుకుంటున్నాను. ఐపీఎల్ వంటి అత్యంత పోటీతత్వంతో కూడిన క్రికెట్ ఆడుతున్నప్పుడు తప్పులు జరగడం సహజం. కానీ ఆ తప్పుల నుంచి పాఠాలు ఎలా నేర్చుకుంటారనేదే కీలకం. మా తప్పిదాలను సవరించుకొని తదుపరి మ్యాచ్‌కు బలంగా తిరిగి వస్తాం - **రజత్ పటీదార్**





# వైభవ్ మరో సచిన్: అనిల్ కుంబ్లే

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే ప్రశంసల జల్లు కురిపించాడు. వైభవ్ సూర్యవంశీ మరో సచిన్ టెండూల్కర్ తరహా ఆటగాడని కొనియాడాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడిని టీమిండియాకు ఆడించే విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించవద్దని సెలెక్టర్లను కుంబ్లే హెచ్చరించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో అసాధారణ ప్రదర్శన కనబరుస్తున్న వైభవ్ సూర్యవంశీపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ సీజన్‌ను హాఫ్ సెంచరీతో ప్రారంభించిన వైభవ్ సూర్యవంశీ.. గుజరాత్ టైటాన్స్‌పై 31, ముంబై ఇండియన్స్‌పై 39 పరుగులతో దూకుడుగా ఆడాడు. ముఖ్యంగా ముంబైతో జరిగిన గత మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో భారీ సిక్స్‌లు బాదాడు. తన విధ్వంసంతో మ్యాచ్‌ను ముంబై నుంచి లాగేసుకున్నాడు. వరల్డ్ బెస్ట్ పేసర్ బుమ్రాను చితక్కొట్టిన వైభవ్ సూర్యవంశీని.. టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అయితే ఈ విషయంలో తొందరపడవద్దని, వైభవ్‌పై అనవసర ఒత్తిడిని తీసుకురావద్దని కుంబ్లే సెలెక్టర్లకు హెచ్చరించాడు. సెలెక్టర్లు, అభిమానుల అంచనాల కంటే.. సదరు ఆటగాడి సన్నద్ధతను బట్టి నిర్ణయం తీసుకోవాలని కుంబ్లే సూచించాడు. శుక్రవారం పీటీఐతో మాట్లాడిన కుంబ్లే.. ఈ వ్యాఖ్యలు చేశాడు. 'వైభవ్ సూర్యవంశీనే తన ప్రదర్శనతో టీమిండియా ఎంట్రీ ఎప్పుడా? అని వస్తున్న ప్రశ్నకు సమాధానం ఇస్తాడని నేను భావిస్తున్నా. కొన్నిసార్లు ఒక ఆటగాడిని జట్టు నుంచి పక్కన పెట్టడం చాలా కష్టంగా మారుతుంది. సచిన్ టెండూల్కర్ విషయంలోనూ అదే జరిగింది. 14, 15 ఏళ్ల వయస్సులో సచిన్ మైదానంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ సెంచరీలు సాధించేవాడు. వైభవ్‌ను చూస్తుంటే అతను కూడా సచిన్ బాటలోనే వెళ్తున్నాడనిపిస్తోంది. అయితే ఇప్పుడే వైభవ్ సూర్యవంశీకి మరో రెండు నెలల్లో టీమిండియా తరఫున ఆడుతావని చెబితే ఆ కుర్రాడిపై అనవసరమైన ఒత్తిడి కలుగుతుంది. కానీ, అతను బ్యాటింగ్ చేస్తున్న తీరు చూస్తుంటే సెలెక్టర్లు అతన్ని నిశితంగా గమనిస్తారనడంలో సందేహం లేదు.'అని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు.




# ముకుల్ చౌదరి రోజుకు 150 సిక్సర్లు

ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుపై లక్నో థ్రిల్లింగ్ విక్టరీ తర్వాత.. ఇప్పుడు అందరి నోటా వినిపిస్తున్న పేరు ముకుల్ చౌదరి. ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో ముకుల్ చౌదరి సూపర్ హీరోగా మారి తన బ్యాటింగ్‌తో కేకేఆర్ చేతుల్లో నుంచి విజయాన్ని లాగేసుకున్నాడు. కేవలం 27 బంతుల్లోనే 7 భారీ సిక్సర్ల సాయంతో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచిన ముకుల్ చౌదరి.. తన పవర్‌ఫుల్ హిట్టింగ్ వెనుక ఉన్న రహస్యాలను వెల్లడించాడు. తాను అంత అలవోకగా సిక్సర్లు ఎలా బాదగలుగుతున్నాడనే విషయంపై ముకుల్ చౌదరి స్పందిస్తూ.. "నా శరీర దారుఢ్యం సహజంగానే కొంచెం ఎక్కుగా ఉంటుంది. అయితే ప్రతిరోజూ 100 నుంచి 150 సిక్సర్లు కొట్టేలా కఠినంగా ప్రాక్టీస్ చేస్తాను. ఇలా నిరంతరం ప్రాక్టీస్ చేయడం వల్ల బ్యాట్ స్వింగ్ వేగం పెరుగుతుంది. గత ఐదారు నెలలుగా నేను చేస్తున్న ఈ సాధనే ఇప్పుడు మైదానంలో ఫలితాలను ఇస్తోంది" అని ముకుల్ చౌదరి వివరించాడు. టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీని తన ఆదర్శంగా భావించే ముకుల్ చౌదరి.. ఈ మ్యాచ్‌లో ఎంఎస్ ధోనీకి పేటెంట్ అయిన హెలికాప్టర్ షాట్‌ను కూడా ఆడి అందరిని అలరించాడు. దీనిపై ముకుల్ చౌదరి మాట్లాడుతూ.. "చిన్నప్పటి నుంచే నాకు ఆ షాట్ అంటే చాలా ఇష్టం. ధోనీ ఇన్నింగ్స్‌ను ఫినిష్ చేసే తీరు నన్ను బాగా ఆకట్టుకునేది. యార్కర్ బంతులను కూడా సిక్సర్లుగా మలిస్తే బౌలర్ ఒత్తిడిలోకి వెళ్లి వేరే రకంగా ఆలోచించడం మొదలుపెడతాడు. అందుకే ఆ షాట్ ను నిరంతరం ప్రాక్టీస్ చేస్తుంటాను" అని ముకుల్ చౌదరి వెల్లడించాడు.




# నేడు పంజాబ్‌తో హైదరాబాద్ ఢీ

## ఎస్ఆర్‌హెచ్ కీలక మార్పు.. లివింగ్‌స్టోన్‌పై వేటు?



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముల్లాన్‌పూర్ వేదికగా జరిగే మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో ఆరెంజ్ ఆర్మీ అమీతుమీ తేల్చుకోనుంది. వరుస విజయాలతో ఓటమి ఎరుగని జట్టుగా జోరు మీదున్న పంజాబ్ కింగ్స్‌కు కళ్లెం వేయాలనే పట్టుదలతో సన్‌రైజర్స్ హైదరాబాద్ బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మళ్లీ విజయాల బాట పట్టాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ తుది జట్టులో కీలక మార్పు చేసే అవకాశం ఉంది. లక్నోతో మ్యాచ్‌లో దారుణంగా విఫలమైన లియామ్ లివింగ్‌స్టోన్‌పై వేటు వేసి అతని స్థానంలో బ్రైడన్ కార్స్‌ను ఆడించే ఛాన్స్ ఉంది. అయితే ఈ మ్యాచ్ మధ్యాహ్నం ఉండటంతో పిచ్ స్లో బౌలర్లకు సహకరించే ఛాన్స్ ఉంది. ఈ లెక్కన స్పిన్నర్ అయిన లివింగ్ స్టోన్‌ను కొనసాగించాలని భావిస్తే అతను తుది జట్టులో కొనసాగుతాడు. లేదంటే అతనికి ఉద్వాసన తప్పదు. ఈ ఒక్కటి మినహా తుది జట్టులో ఎలాంటి మార్పులు జరిగే అవకాశం లేదు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో రూ.13 కోట్ల భారీ ధరకు లివింగ్ స్టోన్‌ను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలి రెండు మ్యాచ్‌ల్లో అవకాశం ఇవ్వలేదు. కానీ సొంతగడ్డపై లక్నో జరిగిన మ్యాచ్‌లో అవకాశం ఇవ్వగా.. అతను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. బ్యాటింగ్‌లో దారుణంగా విఫలమైన అతను ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. దాంతోనే అతనికి ఉద్వాసన పలకాలనే ఉద్దేశంలో సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ఉన్నట్లు తెలుస్తోంది.

# ధోనీ గుర్తొచ్చాడు: సునీల్ గవాస్కర్



ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్‌పై లక్నో సూపర్ జెయింట్స్ సాధించిన ఉత్కంఠభరిత విజయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ యువ బ్యాటర్ ముకుల్ చౌదరిపై ప్రశంసల వర్షం కురిపించారు. ముకుల్ చౌదరి కేవలం 27 బంతుల్లోనే 7 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 54 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తీరును సునీల్ గవాస్కర్ కొనియాడారు. "ప్రతిరోజూ ఐపీఎల్‌లో ఓ కొత్త మెరుపును చూస్తున్నాం. ముకుల్ వంటి యువ ఆటగాడు ఏ మాత్రం భయం లేకుండా, ఒత్తిడిలో తన జట్టును గెలిపించడం అద్భుతం. రాజస్థాన్ తరఫున దేశవాళీ క్రికెట్లో 5వ స్థానంలో బ్యాటింగ్ చేసే ఈ కుర్రాడు.. ఐపీఎల్‌లోకి వచ్చి రాత్రికి రాత్రే అందరూ తన గురించి మాట్లాడుకునేలా చేసుకున్నాడు" అని సునీల్ గవాస్కర్ ప్రశంసించారు. ముకుల్ చౌదరి బ్యాటింగ్‌లో ఉన్న ఆత్మవిశ్వాసాన్ని సునీల్ గవాస్కర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత ముకుల్ చౌదరి కాసేపు సమయం తీసుకుని.. సెట్ అయిన తర్వాత బాల్స్‌ను స్టేడియం బయటకు పంపడం మెచ్చుకోదగ్గ విషయమని పేర్కొన్నారు. ముఖ్యంగా ముకుల్ చౌదరి ఆడిన హెలికాప్టర్ షాట్ చూస్తుంటే ఎంఎస్ ధోనీ పాత జ్ఞాపకాలు గుర్తొచ్చాయని గవాస్కర్ అన్నారు. తనకు షాట్లు కొట్టగలననే నమ్మకం ఉండబట్టే ముకుల్ చౌదరి సింగిల్స్ తీయడానికి నిరాకరించి జట్టును గెలిపించాడని పేర్కొన్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 11-4-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# కాంగ్రెస్‌కు మరిన్ని ఇబ్బందులు తప్పవు

రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదనే మాటకు నిదర్శనంగా తెలంగాణ రాజకీయ ముఖచిత్రం వేగంగా మారుతోంది. ముఖ్యంగా సీనియర్ నాయకులు, ఉద్ధండులు పార్టీలు మారుతుండటం సమీకరణాలను తలకిందులు చేస్తోంది. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి కాంగ్రెస్ వీడి బీఆర్ఎస్ గూటికి చేరడం అధికార పార్టీకి కోలుకోలేని దెబ్బగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారం చేపట్టిన కొద్ది కాలానికే కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తిరుగులేని నాయకుడిగా, దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న జీవన్ రెడ్డి వంటి నేతను కోల్పోవడం పార్టీకి తీరని లోటు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేక ఇబ్బందుల్లో ఉన్న అధికార పార్టీకి, ఈ వలస మరింత చేదు వార్తగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ఒకవైపు విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో, సొంత పార్టీకి చెందిన సీనియర్ నేతలు అసంతృప్తితో ఉండటం కాంగ్రెస్ వైఫల్యంగానే కనిపిస్తోంది. పార్టీ కేడర్‌లో ధైర్యం నింపాల్సిన సమయంలో, అగ్ర నాయకత్వమే పక్క పార్టీ వైపు చూడటం కార్యకర్తలను అయోమయంలో పడేస్తోంది. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ బలమైన పునరాగమనం కోసం ఎదురుచూస్తున్న బీఆర్ఎస్ పార్టీకి, జీవన్ రెడ్డి చేరిక పెద్ద బూస్ట్ అని చెప్పొచ్చు. స్థానిక ఎన్నికలకు ముందు బలమైన నేతను తమవైపు తిప్పుకోవడం ద్వారా, అధికార పార్టీ బలహీనపడిందనే సంకేతాన్ని ప్రజల్లోకి పంపడంలో ప్రతిపక్షం సఫలమైంది. అధికారంలో ఉన్నాం కదా అనే ధీమాతో క్షేత్రస్థాయి పరిస్థితులను విస్మరిస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఈ వలసలు స్పష్టం చేస్తున్నాయి. కాంగ్రెస్ తన సొంత ఇంటిని చక్కదిద్దుకోవడంలో విఫలమైతే, రాబోయే రోజుల్లో మరిన్ని ఇబ్బందులు తప్పవు. జీవన్ రెడ్డి నిష్క్రమణ కేవలం ఒక వ్యక్తి వెళ్లడం కాదు, అది కాంగ్రెస్ కోటలో పడ్డ ఒక పెద్ద పగులు.

# జ్యోతిరావు పూలే.. సమసమాజ పితామహుడు

ఏప్రిల్ 11.. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది. మహాత్మాపూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు.. నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశజనుల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామ క్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలు నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి.



పుణ్యభూమి మహారాష్ట్రలో 1827లో మహాత్మాపూలే జన్మించారు. అతిసామాన్య నేపథ్యం నుంచి ఎదిగారాయన. కానీ తొలినాటి కష్టాలేవీ ఆయన అభ్యాసానికీ, ధైర్యానికీ, సామాజిక నిబద్ధతకూ అడ్డుగోడలు కాలేకపోయాయి. సవాళ్లు ఏవైనా సరే – నిశ్చేష్టులుగా ఉండిపోకుండా.. కష్టపడి జ్ఞానాన్ని ఆర్జించి, ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్న దృఢ సంకల్పమే ఆయనలో ఎన్నడూ తొణికిసలాడేది. చిన్నతనంలోనే, విద్యార్థి దశ నుంచే జ్యోతిరావు పూలేలో అపారమైన జిజ్ఞాస ఉండేది. నిరంతర అధ్యయన శీలి. తన వయసు పిల్లల స్థాయికి మించిన పుస్తకాలను చదివేవాడు. “మనం ఎంత ప్రశ్నిస్తే అంత జ్ఞానాన్ని పొందుతాం” అని తర్వాతి కాలంలో ఆయనే చెప్పారు. చిన్ననాటి నుంచే ఆయనకు అలవడిన ఆ సత్యాన్వేషణ దృక్పథం ఎక్కడా రాజీపడకుండా జీవితాంతమూ కొనసాగింది. విద్యనూ, జ్ఞాన సముపార్జననూ జీవిత లక్ష్యాలుగా మలచుకున్నారు మహాత్మాపూలే. జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదనీ, ఆ శక్తి అందరికీ అందాలనీ స్పష్టంగా గుర్తించారాయన. సమాజంలో అనేకులకు అక్షర జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యావకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికారు. “తల్లి ద్వారా బిడ్డకు అందే సంస్కారం అమూల్యమైనది. అందుకే, పాఠశాలలు తెరవాలనుకుంటే మొదట బాలికల కోసమే తెరవాలి” అనేవారాయన. సామాజిక న్యాయాన్నీ, సమానత్వాన్నీ సాధించే శక్తిమంతమైన సాధనంగా తరగతి గదిని నిలిపి.. ఓ సరికొత్త సామాజిక దృక్పథాన్ని ఆవిష్కరించేందుకు ఆయన ఎంతగానో కృషిచేశారు.



వ్యాసకర్త:
**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

విద్య పట్ల ఆయన దార్శనికత మనందరికీ స్ఫూర్తిదాయకం. దేశ యువతలో పరిశోధన, ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించడం లక్ష్యంగా గత పదేళ్లుగా మేమెంతో కృషి చేశాం. ప్రశ్నించేలా, అన్వేషించేలా, నూతన ఆవిష్కరణలు చేసేలా యువతరాన్ని ప్రోత్సహించే పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తున్నాం. విజ్ఞానం, నైపుణ్యాలు, అవకాశాల్లో పెట్టుబడుల ద్వారా.. సమస్యల పరిష్కర్తలుగా, దేశ ప్రగతికి సారథులుగా భారత్ తన యువతను సశక్తులుగా తీర్చిదిద్దుతోంది. మహాత్మాపూలే తన విజ్ఞానంతో, వివేకంతో.. వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకున్నారు. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీనపడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పల్లెల్ల దాకా.. రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్నమయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తివంచనలేకుండా నిర్విరామంగా కృషి చేశారు.

“జోపర్యంత సమాజాతీల సర్వానా సమాన అధికార మిళత్ నహీత్, తోపర్యంత ఖరే స్వతంత్ర్య మిళత్ నహీ (సమాజంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేంత వరకు నిజమైన స్వేచ్ఛను సాధించలేము)” అన్నది మహాత్మాపూలే అభిప్రాయం. సమ సమాజం లక్ష్యంగా.. ఈ ఆశయాన్ని కార్యాచరణగా మలిచే దిశగా ఎన్నో సంస్థలను ఆయన నెలకొల్పారు. ఆయన స్థాపించిన సత్యశోధక సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మాపూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం. ఆయన వ్యక్తిగత జీవితమూ ధైర్యసాహసాలను బోధించే పాఠమే. నిరంతరం జనబాహుళ్యంలో ఉంటూ ప్రజల కోసం పరితపించడం ఆయన ఆరోగ్యంపై ప్రభావం చూపింది. అత్యంత క్లిష్టమైన అనారోగ్య సమస్యలు కూడా ఆయన సంకల్పాన్ని సడలించలేకపోయాయి. పక్షవాతం బారిన పడి శరీరం సహకరించని స్థితిలోనూ తన కృషిని కొనసాగించారు. అవును, ఆయన శరీరం కఠిన పరీక్షను ఎదుర్కొని ఉండవచ్చు.. కానీ సమాజం పట్ల ఆయన నిబద్ధత మాత్రం సడలలేదు. ఆయన జీవితంలోని ఈ అకుంఠిత దీక్షే.. నేడు ఎన్నో కష్టాలకోర్చి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్న లక్షల మందికి స్ఫూర్తినిస్తోంది.

గౌరవ సావిత్రీబాయి పూలేను స్మరించుకోకుండా మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి అసంపూర్ణమే అవుతుంది. దేశం గర్వించదగ్గ అగ్రశ్రేణి సంస్కర్తల్లో ఆమె ముందువరుసలో నిలుస్తారు. దేశపు తొలితరం మహిళా ఉపాధ్యాయినిగా, బాలికా విద్యా వికాసంలో ఆమె నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తద్వారా వారు కలలను సాకారం చేసుకునే అవకాశాన్నిచ్చారు. మహాత్మా పూలే మరణానంతరమూ.. ఆ ఆశయ దీప్తిని సావిత్రీబాయి ఆరనివ్వలేదు. 1897లో ప్లేగు వ్యాధి విరుచుకుపడిన తరుణంలో.. బాధితుల సేవలో ఆమె పునరంకితమయ్యారు. చివరకు అదే వ్యాధికి గురై ప్రాణాలు విడిచిన త్యాగమూర్తి ఆమె.

మనది పుణ్యభూమి. విశిష్టమైన భావాలు, నిరుపమాన త్యాగాలు, అకుంఠిత దీక్షతో మన సమాజాన్ని శక్తిమంతంగా మలచిన మహనీయులు, వీరనారులకు నిలయమిది. మార్పు ఎక్కడినుంచో మొదలవుతుందని ఎదురుచూడలేదు. వారే మార్పునకు నాంది పలికారు. శతాబ్దాల నుంచి దేశంలో సామాజిక పురోగతి దిశగా.. మన సమాజం నుంచే శంఖారావం వినిపించింది. పీడితుల వ్యథను గుర్తించి.. దానిని ‘తలరాత’ అని సరిపెట్టుకోకుండా ఎదురుతిరిగిన వారి నుంచి ఆ చైతన్యం పుట్టుకొచ్చింది. అలాంటి యోధుల్లో ఒకరు మహాత్మా జ్యోతిరావు పూలే.

2022లో పూణే పర్యటన సందర్భంగా.. అక్కడి మహాత్మా పూలే భవ్య విగ్రహం వద్ద నివాళి అర్పించడం నాకెప్పటికీ గుర్తుంటుంది. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభ వేళ.. ఆయన ఆశయాల దిశగా పునరంకితం కావడమే మనం అర్పించే ఘనమైన నివాళి. ముఖ్యంగా ఆయనకెంతో ఇష్టమైన విద్య వంటి ఆదర్శాలకు మనం పునరంకితం కావాలి. అన్యాయంపై నిరసన తెలిపే సున్నితత్వాన్ని పెంచుకోవాలి. సమాజ స్వయం సంస్కరణ సామర్థ్యంపై మన విశ్వాసాన్ని బలంగా చాటాలి. నైతిక స్పష్టత, ప్రజా ప్రయోజనం రెండూ తోడైతే.. ఈ సమాజ శక్తి దేశంలో అద్భుతాలు సృష్టించగలదని ఆయన జీవితం నిరూపించింది. అందుకే నేటికీ లక్షలాది మందికి ఆయన ఆలోచనలు బలాన్నిస్తున్నాయి. ఆయన మాటలూ, చర్యలూ నేటికీ ఆశను చిగురింపజేస్తున్నాయి. ఆయన జన్మించి దాదాపు రెండు వందల ఏళ్లు గడుస్తున్నా – మహాత్మా జ్యోతిరావు పూలే గత కాలపు శక్తిగానే కాకుండా.. నవ భారత భవితకు మార్గదర్శిగా విరాజిల్లుతున్నారు.

# తెలంగాణలో మరో ‘మార్పు’

తెలంగాణ ప్రజలు “మార్పు” కోసం ఓటేశారు. కానీ, ఆ మార్పు వారి బతుకుల్లో వెలుగులు నింపడానికి బదులు, అనిశ్చితిని మిగిల్చిందనే ఆవేదన ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతోంది. అధికార పగ్గాలు చేపట్టి రెండేళ్లు దాటినా, కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు ముందుకు పడకపోగా, వెనకడుగులే వేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికల వేళ ఆర్భాటంగా ప్రకటించిన ‘ఆరు గ్యారెంటీలు’ నేడు అటకెక్కాయా అన్న అనుమానం ప్రతి సామాన్యుడి మదిలో మెదులుతోంది. అన్నదాతకు అండగా ఉంటామని చెప్పిన రైతు భరోసా పథకం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పెట్టుబడి సాయం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం మాత్రం కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలు రైతులకు కూడా సాయం అందిస్తామన్న హామీ నీటి మూటగానే మిగిలిపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇక రుణమాఫీ విషయం సరేసరి. వడ్డీల భారం పెరుగుతోందే తప్ప, రుణ విముక్తి మాత్రం కలగానే మిగిలిపోతోంది. మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం చేస్తామన్న ‘మహాలక్ష్మి’ పథకం అమలులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఉచిత బస్సు ప్రయాణం మినహా, మహిళా సంక్షేమం కోసం తీసుకున్న చెప్పుకోదగ్గ చర్యలేవీ కనిపించడం లేదు. గ్యాస్ సిలిండర్ రాయితీ, తులం బంగారం వంటి హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పాలనపై దృష్టి సారించాల్సింది పోయి, సొంత పార్టీలోని లుకలుకలను చక్కదిద్దుకోవడానికే సమయం వెచ్చిస్తోందనే విమర్శలు బలంగా ఉన్నాయి. మంత్రుల మధ్య సమన్వయ లోపం, బహిరంగ విమర్శలు ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చుతున్నాయి. “మేమే అధిష్టానం” అన్నట్టుగా వ్యవహరిస్తున్న కొందరు నేతల తీరు, పాలనా యంత్రాంగంపై పట్టు సడలేలా చేస్తోంది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే, అధికార పార్టీ మాత్రం వాటిని తిప్పికొట్టడంలో విఫలమవుతోంది. కాగ్ నివేదికలు సైతం ఆర్థిక నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న తరుణంలో, ప్రభుత్వం మరింత జవాబుదారీగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదన్న సంకేతాలు బలంగా ఉన్నాయి. ప్రజల సహనానికి కూడా ఓ హద్దు ఉంటుంది. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఇంకా కాలయాపన చేస్తే, తెలంగాణ సమాజం మరోసారి తమ తీర్పుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉందన్న సత్యాన్ని పాలకులు గ్రహించాలి. లేదంటే, “కాంగ్రెస్ వస్తే కరెంట్ పోతది” అనే పాత నానుడి నిజమేనని ప్రజలు నమ్మే రోజు ఎంతో దూరంలో లేదు.

**- మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్, కామారెడ్డి**





**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.